NEELAGIRI VARTHA TELUGU DAILY
# నీలగిరి వార్త
మన కోసం మన వార్త
APTEL/2009/31957 తెలుగు దినపత్రిక
తెలంగాణ ఎడిటర్ : గుంటోజి విష్ణుమూర్తి, బుధవారం 9-10-2024 సంపుటి : 15 సంచిక : 102, పేజీలు 12 వెల : 4/-




3 లో..

## 97 శాతం స్పామ్ కాల్స్ బ్లాక్



3 లో..

## ఆరో రోజూ అమ్మకాల వెల్లువ

# తప్పిన ఎగ్జిట్ పోల్ అంచనాలు

- హర్యానాలో హ్యాట్రిక్ విజయం దిశగా బిజెపి
- జులానా నుంచి వినేశ్ ఫోగట్ విజయం
- కాశ్మీర్‌లో ఎన్సీ, కాంగ్రెస్ కూటమి హవా
- ఒమర్ అబ్దుల్లానే తదుపరి సిఎం అన్న ఫరూక్
- 370ని ప్రజలు తిరస్కరించారని ఫరూక్ వ్యాఖ్య

2లో

హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారయ్యాయి. ఉత్కంఠ భరితంగా సాగుతున్న హరియాణా పోరులో భాజపా హ్యాట్రిక్ దిశగా దూసుకెళ్తోంది. తొలుత కాంగ్రెస్ ఆధిక్యంలో ఉండగా.. అనూహ్యంగా కమలం పుంజుకుని ఆధిక్యాల్లో మ్యాజిక్ ఫిగర్‌ను దాటేసింది. వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా వెళ్తోంది. అటు జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ – కాంగ్రెస్ కూటమికి ఓటర్లు స్పష్టమైన మెజార్టీ ఇచ్చినట్లే కన్పిస్తోంది.



# ఏం బాధపడకండి.. ఆ రోడ్డు తెరిపించే బాధ్యత నాదే..

- మన్సూరాబాద్ -పోచంపల్లి రోడ్డు తప్పక తెరిపిస్తా..
- ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్: నీలగిరి వార్త ప్రతినిధి

విజయవాడ జాతీయ రహదారిపైన ఉన్న ట్రాఫిక్‌ను అదిగమించేందుకు పోచంపల్లి- మన్సూరాబాద్ వరకు ఉన్న పాత రోడ్డు తెరిపించే బాధ్యత నాదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆయన మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి క్రీడా అధికారులు శ్రీ సాయినగర్‌కాలనీ వద్ద మూసివేసిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గతంలో ఉన్న పాత రోడ్డు మ్యాపును ఈటలకు చూపించారు. రోడ్డును మూసి వేయడం వల్ల కలుగుతున్న ఇబ్బందులను, ట్రాఫిక్ సమస్యలను ఎంపీకి వివరించారు. దాదాపు వంద సంవత్సరాలుగా ఉన్న రోడ్డును కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రిడా) ఏర్పాటుతో అధికారులు రోడ్డుకు అడ్డంగా గోడను కట్టి మూసివేశారని తెలిపారు. ప్రజలకు కలుగుతున్న అసౌకర్యంపై దాదాపు 30 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని నర్సింహారెడ్డి ఎంపీకి వివరించారు. అయినా



అధికారులు స్పందించడం లేదని అన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. నగరానికి దూరాన్ని తగ్గించేదిగా ఉన్న మన్సూరాబాద్- పోచంపల్లి రోడ్డును కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తెరిపించడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నా రు. ఈ రోడ్డును తెరిపించడం వల్ల విజయవాడ జాతీయ రహదారిపైన ట్రాఫిక్ తగ్గుతుందన్నారు.

## నష్టపోయిన మత్స్యకారులను
# ఆదుకుంటాం

- వరద వల్ల మత్స్యకారులకు తీవ్రనష్టం
- ఇందిరమ్మ ప్రభుత్వం..పేదల ప్రభుత్వం
- పేదోడి కళ్లలో ఆనందమే ధ్యేయం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి
- కూసుమంచి పాలేరు జలాశయంలో చేపల పిల్లల విడుదల

2వ పేజీ



# మంత్రి పొన్నం కీలక నిర్ణయం..



హైదరాబాద్, నీలగిరి వార్త ప్రతినిధి

రవాణా శాఖలో రెండు మూడు సంస్కరణలు తీసుకువస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మోటారు వాహన చట్టంలో భాగంగా దేశంలో 28 రాష్ట్రాలు ఇప్పటికే సారథి వాహన్ పోర్టల్ అమలు చేస్తున్నాయన్నారు. ఇంటర్ స్టేట్ రిలేషన్స్‌కు ఇబ్బంది వస్తుండడంతో క్షేత్ర స్థాయిలో ఆర్టీవో డీటీవోలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ కూడా సారథి ఈ వాహన పోర్టల్ లో చేరుతున్నట్లు చెప్పారు. జీవో 28 ద్వారా ఇది అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో, దేశంలో వాహనాలకు సంబంధించి 15 సంవత్సరాలు మనం వాడే వాహనాలు , 8 సంవత్సరాలు ప్రైవేట్ వాహనాలు స్క్రాపింగ్ పాలసీ తీసుకురావడం జరిగిందన్నారు.

## న్యాయవాదుల విహారయాత్ర
# విషాదం.. చంద్రబాబు దిగ్భ్రాంతి

విజయవాడ నీలగిరి వార్త ప్రతినిధి



బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు ప్రయాణిస్తున్న బస్సుకు ఘోర ప్రమాదం సంభవించింది. న్యాయవాదులు అంతా కలిసి రెండు బస్సుల్లో విహారయాత్రకు వెళ్లారు. ఈ క్రమంలో రాజస్థాన్‌లోని అజ్మీర్ వద్ద మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు రెండు బస్సుల్లో ఒక బస్సు ప్రమాదానికి గురైంది. ఆగి ఉన్న ట్రక్కును న్యాయవాదుల బస్సు ఢీ కొట్టడంతో సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ భార్య జ్యోత్స్న అక్కడికక్కడే మృతి చెందారు.

### సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

రాజస్థాన్ లో విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారన్న ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# చెరువులు, మూసిపై చర్చకు రండి ..

- కాంగ్రెస్ కు బిఆర్ఎస్ సవాల్
- సుందరీకరణ అంటే ఇళ్లను కూల్చడం కాదు
- మూసీలో మురుగునీరు కలపకుండా ఆపడం
- ఆ మాత్రం కూడా తెలియని కాంగ్రెస్ నేతలు
- రూ.16వేల కోట్లతో తామే మూసీ ప్రక్షాళనకు ప్లాన్ వేశాం
- తామే సుందరీకరణ చేపడతాం.. ఇచ్చే దమ్ముందా
- రేవంత్ సర్కార్‌కు ఆఫర్ ఇచ్చిన బిఆర్ఎస్

2వ పేజీ



## ఢిల్లీలో సీఎం చంద్రబాబును కలిసిన కేంద్ర మంత్రి కుమారస్వామి

ఢిల్లీ: నీలగిరి వార్త ప్రతినిధి

ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఇవాళ చంద్రబాబు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్, నేషనల్ హైవేల అభివృద్ధి తదితర అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశం అనంతరం, ఢిల్లీలో సీఎం చంద్రబాబు అధికారిక నివాసానికి కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి వచ్చారు. విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్ (స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్)లో విలీనం చేయడంపై చంద్రబాబు, కుమారస్వామి మధ్య కీలక చర్చ జరిగింది. సెయిల్ లో విలీనం అనంతరం విశాఖ ఉక్కు పరిశ్రమ పరిస్థితి, కార్మికుల స్థితిగతులు మెరుగవ్వాలనే విషయాన్ని చంద్రబాబు కేంద్రమంత్రి కుమారస్వామికి స్పష్టం చేశారు.



# నష్టపోయిన మత్స్యకారులను ఆదుకుంటాం

**వరద వల్ల మత్స్యకారులకు తీవ్రనష్టం**

**ఇందిరమ్మ ప్రభుత్వం..పేదల ప్రభుత్వం**

**పేదోడి కళ్లలో ఆనందమే ధ్యేయం**

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**

**కూసుమంచి పాలేరు జలాశయంలో చేపల పిల్లల విడుదల**

**ఖమ్మం :** నీలగిరి వార్త ప్రతినిధి

తుపాను, వర్షాలు, వరదల వల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా కూసుమంచి పాలేరు జలాశయంలో చేప పిల్లలను ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు కోరి తెచ్చుకున్నారని, అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇది పేదల ప్రభుత్వామని, పేదోడి కళ్లలో ఆనందం చూడటమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

**వరద బాధితలకు ఇళ్లు మంజూరు**

వరదల వల్ల పేదలు ఇళ్లు కోల్పోయారని, అలాంటి బాధితులకు ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తాను అందుబాటులో ఉంటానని చెప్పారు.

**వంద శాతం సబ్సిడీపై చేపల పిల్లల విడుదల**

%రాష్ట వ్యాప్తంగా కులవృత్తిదారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 100శాతం సబ్సిడీతో ఉచిత చేప పిల్లలను విడుదల చేస్తున్నామని పొంగులేటి అన్నారు. ప్రజలు ఏ విశ్వాసంతో అయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారమిచ్చారో అదే విశ్వాసంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘురామ్ రెడ్డి, రాష్ట ఫిషరీష్ చైర్మన్ సాయి, ఐటీసీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు పాల్గొన్నారు.

# చెరువులు, మూసిపై చర్చకు రండి ..

**కాంగ్రెస్ కు బిఆర్ఎస్ సవాల్**

**సుందరీకరణ అంటే ఇళ్లను కూల్చడం కాదు**

**మూసీలో మురుగునీరు కలపకుండా ఆపడం**

**ఆ మాత్రం కూడా తెలియని కాంగ్రెస్ నేతలు**

**రూ.16వేల కోట్లతో తామే మూసీ ప్రక్షాళనకు ప్లాన్ వేశాం**

**తామే సుందరీకరణ చేపడతాం.. ఇచ్చే దమ్ముందా**

**రేవంత్ సర్కార్‌కు ఆఫర్ ఇచ్చిన బిఆర్ఎస్**

**హైదరాబాద్** నీలగిరి వార్త ప్రతినిధి

చెరువులు, మూసీ పరిస్థితిపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి . అసలు ప్రభుత్వం వద్ద మూసీపై డీపీఆర్ ఉందా? అని ప్రశ్నించారు. మూసీని, హుస్సేన్ సాగర్‌ను మురికికూపంలో మార్చిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. సుందరీకరణ అంటే ఇళ్లు, గుడిసెలు కూలగొట్టడం కాదన్నారు. మూసీలో కలిసే మురికి నీటిని, కాలుష్యాన్ని ఆపడం సుందరీకరణ అంటారని చురక అంటించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ. మూసీ సుందరీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక ఏమిటో చెప్పాలని నిలదీశారు. మూసీ సుందరీకరణ తమ హయాంలోనే ప్రారంభమైందని, రూ.16 వేల కోట్ల ఖర్చు అవుతుందని డీపీఆర్ ఇచ్చామని గుర్తు చేశారు. కాళేశ్వరం నీటిని కొండపోచమ్మ నుంచి ఉస్మాన్ సాగర్, హిమయత్ సాగర్‌కు తీసుకువచ్చి పరిశుభ్రమైన నీటిని అందించేందుకు తమ ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ఇప్పటికీ మూసీ ప్రక్షాళన చేసేందుకు తాము సిద్ధమని, మాకు ఇచ్చే దమ్ము మీకు ఉందా? అని సవాల్ చేశారు. ప్రభుత్వం వద్ద రుణమాఫీకే డబ్బులు లేవు, మూసీ సుందరీకరణకు ఎక్కడి నుంచి వస్తాయో చెప్పాలన్నారు.

# భౌతిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

**జాన్ జె.హోప్‌ఫీల్డ్, జెఫ్రీ ఈ.హింటన్‌లకు పురస్కారం**

**స్టాక్‌హోం,** నీలగిరి వార్త ప్రతినిధి

భౌతికశాస్త్రంలో విశేష కృషి చేసినందుకు ఈ ఏడాది ఇద్దరికి నోబెల్ బహుమతి లభించింది. జాన్ జె.హోప్‌ఫీల్డ్, జెఫ్రీ ఈ.హింటన్‌లకు ఈ పురస్కారం అందుకోనున్నారు. ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్‌లతో మెషిన్ లెర్నింగ్ ఆవిష్కరణలకు గానూ ఈ అత్యున్నత పురస్కారం వరించింది. స్టాక్‌హోంలో ఉన్న కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్‌లోని నోబెల్ బృందం ఈ పురస్కారాలను ప్రకటించింది. గతేడాది (2023) భౌతికశాస్త్రంలో ఈ పురస్కారం ముగ్గురిని వరించింది. పరమాణువుల్లోని ఎలక్ట్రాన్ల కదలికలను శోధించిన ఫ్రాన్స్ శాస్త్రవేత్త పియర్ అగోస్తి, హంగేరియన్ సంతతి వ్యక్తి ఫెరెంక్ క్రౌజ్, ఫ్రాన్స్-స్వీడన్ శాస్త్రవేత్త యాన్ ఎల్ హ్యులియర్‌లు ఆ పురస్కారం అందుకున్నారు. మొత్తంగా 1901 నుంచి ఇప్పటివరకు 117సార్లు భౌతికశాస్త్రంలో నోబెల్ ప్రకటించారు. వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబర్ 14వరకు కొనసాగనుంది. సోమవారం వైద్యశాస్త్రంలో విజేతలను ప్రకటించగా.. నేడు భౌతికశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడించారు. బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యం విభాగాల్లో విజేతలను ప్రకటిస్తారు. శుక్రవారం రోజున నోబెల్ శాంతి బహుమతి , అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న సంగతి తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ఏటా ప్రదానం చేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు 11లక్షల స్వీడిష్ క్రోనర్ (10లక్షల డాలర్లు) నగదు అందుతుంది. డిసెంబర్ 10న నిర్వహించే కార్యక్రమంలో గ్రహీతలకు అవార్డులను అందజేస్తారు.

# వరద నష్టం పంపిణీపై దుష్ప్రచారమా

**విజయవాడ,**

వరద నష్ట పరిహారం పంపిణీపై వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని ఉమ్మడి కృష్ణా జిల్లా తెదేపా ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై బురదచల్లేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్ పాల్గొన్నారు. వరదలు వచ్చిన 15-20 రోజుల్లోనే బాధితులకు ప్రభుత్వం పరిహారం పంపిణీ చేసిందని గద్దె రామ్మోహన్ అన్నారు. 98 శాతం మందికి సాయం అందిందని.. సాంకేతిక కారణాలతో 2 శాతం మందికి అందలేదని చెప్పారు. త్వరలోనే వారికీ పరిహారం అందజేస్తా మన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం అందాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. పరిహారం అందలేదనే ఫిర్యాదులు బాధితుల నుంచి రాకూడదని అధికారులకు ఆయన స్పష్టం చేశారని చెప్పారు. వైకాపా తప్పుడు ప్రచారం చేస్తోందని.. ప్రజలకు వాస్తవాలు తెలియాలని వసంత కృష్ణప్రసాద్ అన్నారు.

# తప్పిన ఎగ్జిట్ పోల్ అంచనాలు

**హర్యానాలో హ్యాట్రిక్ విజయం దిశగా బిజెపి**

**జులానా నుంచి వినేశ్ ఫోగట్ విజయం**

**కాశ్మీర్‌లో ఎన్సీ, కాంగ్రెస్ కూటమి హవా**

**ఒమర్ అబ్దుల్లానే తదుపరి సిఎం అన్న ఫరూక్**

**370ని ప్రజలు తిరస్కరించారని ఫరూక్ వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,** నీలగిరి వార్త ప్రతినిధి

హరియాణా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారయ్యాయి. ఉత్కంఠ భరితంగా సాగుతున్న హరియాణా పోరులో భాజపా హ్యాట్రిక్ దిశగా దూసుకెళ్తోంది. తొలుత కాంగ్రెస్ ఆధిక్యంలో ఉండగా.. అనూహ్యంగా కమలం పుంజుకుని ఆధిక్యాల్లో మ్యాజిక్



ఫిగర్‌ను దాటేసింది. వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా వెళ్తోంది. అటు జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ - కాంగ్రెస్ కూటమికి ఓటర్లు స్పష్టమైన మెజార్టీ ఇచ్చినట్లే కన్పిస్తోంది. ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత అన్ని సర్వే సంస్థలు హర్యానాలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. ప్రస్తుతం ఫలితాల సరళి చూస్తే మాత్రం హర్యానా ప్రజలు మరోసారి బీజేపీని ఆదరించి నట్లు తెలుస్తోంది. ఎన్నికల వేళ కాంగ్రెస్ చేసిన తప్పిదాలే ఆ పార్టీ మెజార్టీ మార్క్ సాధించక పోవడానికి కారణంగా విశ్లేషిస్తున్నారు. హర్యానా ఎన్నికల్లో అందరినీ దృష్టిని ఆకర్షించిన రెజ్లర్ వినేశ్ ఫోగట్ కాంగ్రెస్ అభ్యర్థిగా జులానా నుంచి పోటీచేసి గెలుపొందారు. హరియాణాలో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 46 స్థానాలు అవసరం. ప్రస్తుతం ఇక్కడ భాజపా ఆధిక్యం, గెలుపు కలిపి 47 స్థానాల్లో దూసుకెళ్తోంది. కాంగ్రెస్ 37 స్థానాలకు పరిమితమైంది. ఐఎన్ఎల్డీ 2, ఇతరులు 4 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతా తెరవకపోవడం గమనార్హం. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తప్పాయి. ఇక్కడ బీజేపీ స్పష్టమైన ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. ఇప్పటికే మ్యాజిక్ ఫిగర్‌ను దాటి అత్యధిక స్థానాల్లో ముందంజలో ఉంది. హర్యానాలో 90 అసెంబ్లీ స్థానాలకు గానూ కమలం పార్టీ 51 స్థానాల్లో లీడింగ్‌లో ఉంది. దీంతో బీజేపీ శ్రేణులు సంబరాలు షురూ చేశారు. పార్టీ అత్యధిక స్థానాల్లో లీడింగ్‌లో ఉండటంతో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు మొదలు పెట్టారు. అంబాలో పార్టీ జెండాలను చేతపట్టుకుని డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. మిఠాయిలు తినిపించుకున్నారు. కొన్ని చోట్ల బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఓ రకంగా చెప్పాలంటే హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు టీ 20 మ్యాచ్‌ను తలపించాయి. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో దూసుకెళ్లిన కాంగ్రెస్ ఒక్కసారిగా పడిపోయింది. ఈవీఎంలు లెక్కింపు తర్వాత వైకుంఠపాళీ ఆటలో మాదిరిగా కాంగ్రెస్ ఒక్కో సీటు తగ్గుతూ వచ్చింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌లతో ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొదట్లో కాంగ్రెస్ దూసుకెళ్లింది. దాదాపు అరవైకిపైగా స్థానాల్లో ఆధిక్యం చూపించింది. ఈ దెబ్బకు బీజేపీకి 20 స్థాలైనా వస్తాయా అన్న అనుమానం కలిగింది. కానీ 10 గంటల తర్వాత ఫలితాలు తారుమారు అవుతూ





వచ్చాయి. అప్పటి వరకు విజయం దిశగా దూసుకెళ్తున్న కాంగ్రెస్ ఒక్కసారిగా పడిపోయింది. బీజేపీ సునామీ మొదలైంది. ఒకానొక దశలో ఇరు పార్టీల మధ్య హోరాహోరీ పోరు తప్పదేమో అన్నట్టు ఫలితాలు వచ్చాయి. అయినా చివరకు బీజేపీ పై చేయి సాధించింది. యాభైకు పైగా స్థానాల్లో ఆధిక్యం చూపించి హర్యానాలో ఒంటరిగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. హర్యానాలో మొదటి ట్రెండ్స్ చూసిన కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఏఐసీసీ కార్యాలయం వద్ద స్వీట్స్ పంచుకున్నాయి. బాణసంచా పేల్చాయి. వాళ్ల సంతోషం ఎంతసేపు నిలవలేదు. అక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు వస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ దూసుకెళ్తోంది. కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ దూసుకెళ్తోంది. ప్రస్తుతం ఆధిక్యం, గెలుపు కలిపి 43 స్థానాల్లో దూసుకెళ్తోంది. ఇక, భాజపా 28, పీడీపీ 2, కాంగ్రెస్ 7 స్థానాల్లో ముందంజలో



ఉన్నాయి. ఇతరులు 10 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇక్కడ, భాజపా, పీడీపీ ఒంటరిగా పోటీ చేశాయి. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తులో ఉన్నాయి. ఎన్నికల ముందే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఈ పార్టీ.. తాజాగా వెలువడుతున్న ఫలితాల్లో మ్యాజిక్ ఫిగర్‌ను దాటింది. దీంతో తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేది ఆసక్తికరంగా



మారింది. ఈ నేపథ్యంలో నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. తన కుమారుడు ఒమర్ అబ్దుల్లానే ముఖ్యమంత్రి బాధ్యతలు చేపడుతారని తెలిపారు. పదేళ్ల తర్వాత ప్రజలు తమ తీర్పును తెలియజేశారు. ఆగస్టు 5 నాటి ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని ప్రస్తావిస్తూ నిర్ణయాన్ని తాము అంగీకరించడం లేదని స్పష్టంగా చెప్పారు. ఒమర్ అబ్దుల్లానే తదుపరి ముఖ్యమంత్రిగా ఉంటారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించేం దుకు మా కూటమి నిరంతరం పోరాడుతుందని ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు. ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 46 స్థానాలు అవసరం.

# ప్రజాధనాన్ని దుబారా చేసిన జగన్

**ఎగ్‌పఫ్‌లకే 3కోట్లు తగలేశారు**

**టిడిపి ప్రతినిధి పట్టాభిరామ్ ఆరోపణలు**

**అమరావతి,** నీలగిరి వార్త ప్రతినిధి



వరద బాధితులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం చంద్రబాబు పరిహారం అందించారని తెదేపా అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. వైకాపా ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఐదారు రెట్లు అదనంగా ప్రయోజనం కల్పించామని చెప్పారు. పరిహారం పంపిణీపై వైకాపా చేస్తున్న దుష్ప్రచారంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పట్టాభి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వరదలు వస్తే బాధితులకు గరిష్ఠంగా రూ.4వేల పరిహారం మాత్రమే ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో నీటమునిగిన ఇళ్లకు రూ.25వేల సాయం అందించారని చెప్పారు. వరద బాధితులకు ఎంత ఖర్చయిందో చెబుతున్నామన్నారు. ఏమీ దాచుకోమని.. చివరి వరకు దేనికి ఎంత ఖర్చుచేశామో స్పష్టంగా వెల్లడిస్తామని చెప్పారు. సచివాలయ భవనాలకు రంగుల కోసం గతంలో జగన్ ప్రభుత్వం రూ.3వేల కోట్లు తగలేసింది. సర్వేరాళ్లపై జగన్ బొమ్మకు రూ.700 కోట్లు, రుషికొండ ప్యాలెస్ పేరుతో రూ.600 కోట్లు, సాక్షిలో ప్రకటనలకు రూ.500 కోట్లు ఖర్చు చేశారు. ఎగ్ పఫ్‌లకే రూ.మూడున్నర కోట్లు మింగేశారు. ఇలా రంగులు, ప్రచార పిచ్చికి రూ.4,800 కోట్లు తగలేశారు. ప్రజలు కష్టాల్లో ఉంటే జగన్ ఏనాడైనా పరామర్శించారా?వరద బాధితులకు రూ.కోటి ఇస్తానని సెప్టెంబర్ 4న ప్రకటించారు.. ఇప్పటి వరకూ దిక్కులేదని పట్టాభి వ్యాఖ్యానించారు.

# కోల్‌కతా ఆర్‌జి కర్ ఆస్పత్రిలో అనూహ్య ఘటన

**ప్రభుత్వ తీరుకు వైద్యుల నిరస**

**50మంది వైద్యుల మూకుమ్మడి రాజీనామా**

**కోల్‌కతా,** నీలగిరి వార్త ప్రతినిధి

కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థిని హత్యాచారం ఘటనలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. పలువురు వైద్యులు అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జూనియర్ వైద్యులు చేపట్టిన నిరాహార దీక్షకు సీనియర్ వైద్యులు, ఫ్యాకల్టీ సభ్యులు మద్దతు ప్రకటించారు. ఇందులో భాగంగా ఆర్‌జీ కర్ ఆస్పత్రిలోని 50 మంది సీనియర్ వైద్యులు, బోధనా సిబ్బంది మూకుమ్మడిగా రాజీనామా చేశారు. కోల్‌కతాలోని ఆర్జీ కర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధితురాలికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగించారు. సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వంతో చర్చలు జరిపారు.

NEELAGIRI VARTHA TELUGU DAILY
నీలగిరి వార్త
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# సుప్రీంకోర్టు ఆగ్రహం

తాము మూడేళ్ల క్రితం స్పష్టంగా ఆదేశించినా- దేశంలోని పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నవంబరు 19లోగా తగు చర్యలు తీసుకోవాలని, ఇదే తాము ఇస్తున్న చివరి అవకాశమని ఘాటుగా హెచ్చరించింది. దేశంలోని పేదల పట్ల, వలస కార్మికుల సంక్షేమం పట్ల దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ స్థాయిలో స్పందించటం అభినందనీయం. తనకు తానుగా అన్నార్తులకు అండగా నిలవకపోగా, సుప్రీం చెప్పిన తరువాత కూడా ఇన్నేళ్లూ పట్టించుకోని మోడీ ప్రభుత్వం తీరు ఆక్షేపణీయం."దేశంలో ఏ ఒక్కరూ పస్తులతో పడుకున్నా మన స్వాతంత్ర్యానికి సంపూర్ణత



లేదన్నట్టే!" అన్నారు మహాత్మా గాంధీ. ఆ మాట ప్రకారం చూస్తే%ౌ% ఆడంబరంగా అమృతోత్సవం జరుపుకొన్న 75 ఏళ్ల స్వరాజ్య పాలన తరువాత కూడా మనం ఇంకా సంపూర్ణత సాధించలేదు. దేశంలో రోజూ 19 కోట్ల మంది ప్రజలు ఖాళీ కడుపుతో పడుకుంటున్నారని జాతీయ ఆరోగ్య సర్వే నివేదించింది. అన్ని తరగతుల ప్రజలూ నిత్యావసరాల కోసం నానా ఇక్కట్లూ పడుతున్న పరిస్థితి రోజురోజుకీ పెరుగుతోంది. రెక్కాడితేనే కాని డొక్కాడని కోట్లాదిమంది శ్రామికుల జీవనం మరింత దుర్భరంగా మారింది. 2020 నాటి కోవిడ్ కాలం ఈ దుర్భర దృశ్యాన్ని దేశానికి కళ్లకు కట్టినట్టు చూపించింది.

రోజువారీ పని ఒక్కసారిగా ఆగిపోతే- వలస కార్మికులు ఆ మరుసటి రోజుకే కడుపు నింపుకోవడం కనాకష్టమైన దుస్థితిని దృశ్యమానం చేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకొని, దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో ఉండరాదని, తక్షణమే అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు చేసి, బియ్యం వగైరా దినుసులు అందించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇది జరిగి మూడేళ్లు పూర్తయినా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యం.

పైగా తమ పాలనలో దేశం బ్రహ్మాండంగా వెలిగిపోతున్నట్టు, ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పురోగమించి, అందరూ ధనికులైపోతున్నట్టు గొప్పలు వల్లించింది. అంతర్జాతీయ ఆకలి సూచిలో 125 దేశాల్లో భారత్ 111వ స్థానంలో ఉందనిబీ పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక కన్నా పరిస్థితి అథమంగా ఉందని నివేదికలు వెల్లడిస్తే, అవన్నీ తప్పుడు లెక్కలని అధికార బిజెపి నాయకులు ఖండించటానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజల దైనందిన సమస్యలను గాలికొదిలేసి, ఉద్వేగ ఉద్రేక రాజకీయాలతో దేశాన్ని ఊగించటానికి ప్రధాని మోడీ సహా కాషాయ నేతలు తెగించారు.వాస్తవాలతో సంబంధం లేని ఉద్వేగాలూ, ఉన్మాదాలూ ఏ సమస్యనూ పరిష్కరించలేవు. పైగా పరిస్థితిని జటిలం చేస్తాయి. మోడీ హయాంలో జరిగిందిదే! ప్రపంచంలో 82 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతుంటే %-% అందులో 20 కోట్ల మంది మనదేశంలోనే ఉన్నారు. రోజూ పస్తులతో పడుకుంటున్న అన్నార్తుల్లో 24 శాతం మంది మనవాళ్లే! ఆకలి, పోషకాహార లేమి కారణంగా రోజూ 4500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఇలాంటి దుస్థితి నుంచి గట్టెక్కించటానికి యుపిఎ %-% 1 ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం వంటివి ఎంతోకొంత దోహదపడ్డాయి. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నిధులు తగ్గించి ఈ చట్టాలను నిర్వీర్యం చేశారు. అంబానీ %-% అదానీ వంటి కార్పొరేట్లను అత్యంత సంపన్నులుగా మార్చే పథకాలూ విధానాలు చేపట్టి, సాధారణ ప్రజల అభివృద్ధిని గాలికొదిలేశారు.

# 97 శాతం స్పామ్ కాల్స్ బ్లాక్

### ఎయిర్‌టెల్ కొత్త ఎఐ సిస్టమ్‌తో చెక్

### తెలుగు రాష్ట్రాల సిఇఒ వెల్లడి




**హైదరాబాద్ :**

తమ వినియోగదారులను స్పామ్ కాల్స్, మెసేజ్‌ల నుంచి రక్షించడానికి కొత్తగా ఎఐ ఆధారిత స్పామ్ డిటెక్షన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేశామని భారతీ ఎయిర్‌టెల్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) శివన్ భార్గవ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ వినియోగదారుల అన్ని పరికరాల్లో ఆటోమేటిక్ యాక్టివేషన్‌తో ఉచితంగా దీన్ని అందిస్తున్నామన్నారు. దీన్ని ప్రారంభించిన 10 రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 12.2 కోట్ల స్పామ్ కాల్స్, 23 లక్షల స్పామ్ ఎస్‌ఎంఎస్ మెసేజ్‌లను విజయవంతంగా గుర్తించి బ్లాక్ చేశామన్నారు. దీనికి ఎలాంటి యాప్ డౌన్‌లోడ్ అవసరం లేదన్నారు. ఉచితంగా ఆటోమెటిక్‌గా ఈ సేవలు అందుతాయన్నారు. స్మార్ట్‌ఫోన్లతో ఇటీవల మోసాలకు గురయ్యే ప్రమాదం విపరీతంగా పెరగడంతో ఈ క్లిష్టమైన సమస్యను చురుకుగా పరిష్కరించడానికి తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. రెండు రాష్ట్రాల్లో తమకు 3 కోట్ల పైగా ఖాతాదారులున్నారని తెలిపారు.

## స్టాండప్ కమెడియన్ ట్వీట్.. ఓలా షేర్ల పతనం

**ముంబయి :**

ఓలా ఎలక్ట్రిక్ సర్వీసు సెంటర్ల కొరతపై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన ట్వీట్ ఆ కంపెనీ షేర్లను భారీగా పడేసింది. ఓలా పేలవ సేవలు, సర్వీసింగ్ సెంటర్ల ముందు పెద్ద ఎత్తున పోగుబడిన వాహనాల ఫోటోను ఎక్స్ వేదికలో కునాల్ పంచుకున్నారు. ఈ అధ్వాన పరిస్థితుల్లో భారతీయులు ఇవిలను ఎలా ఉపయోగించుకోగలరని మంత్రి నితిన్ గడ్కరీకి ట్యాగ్ చేశారు. దీనిపై ఓలా సిఇఒ భవిష్ అగర్వాల్ తీవ్రంగా స్పందించారు.ఇది కాస్తా ఇద్దరి మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. ఆ ప్రభావం కంపెనీ షేర్లపై గట్టిగా పడింది. సోమవారం బిఎస్ఇలో ఓలా షేర్ 9.4 శాతం పతనమై రూ.89.7కు పడిపోయింది. ఈ కంపెనీల్లో గరిష్ట స్థాయిలో షేర్లు కొనుగోలు చేసిన వారు భారీ నష్టాలను చవి చూస్తున్నారు. ఆగస్టులో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన రోజుల్లో రూ.70 వద్ద లిస్టింగ్ కాగా.. అదే నెల 20న రూ.157కు చేరింది. ఈ ధర వద్ద కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లు ప్రస్తుతం ఏకంగా 43 శాతం విలువ కోల్పోయినట్లయ్యింది.

# హిమాచల్ ఆర్‌టిసికి మరిన్ని ఒలెక్ట్రా బస్సులు




## 327 వాహనాల టెండర్ సొంతం

**హైదరాబాద్ :**

హిమాచల్ రోడ్డు రవాణా సంస్థ (హెచ్‌ఆర్‌టిసి)కి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మరిన్ని బస్సులను సరఫరా చేయనుంది. విద్యుత్ బస్సుల కొనుగోలుకు తాజాగా పిలిచిన టెండర్లలో ఒలెక్ట్రా తక్కువ ధర కోట్ చేసి ఎల్ 1 బిడ్డర్ గా నిలిచింది. హెచ్‌ఆర్‌టిసి 327 విద్యుత్ బస్సుల కొనుగోలుకు తాజాగా టెండర్లు పిలిచింది. ఇందులో తొమ్మిది మీటర్ల బస్సులు 297, 12 మీటర్ల బస్సులు 30 ఉన్నాయి. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, స్విచ్ మొబిలిటీ టెండర్లలో పాల్గొన్నాయి. టెండర్ ప్రక్రియ అనంతరం నిర్వహించిన సాంకేతిక పరీక్షల్లో రెండు సంస్థలు అర్హత సాధించాయి. అయితే తక్కువ ధర కోట్ చేసి ఒలెక్ట్రా సంస్థ అంతిమంగా ఎల్1 గా నిలిచింది. హిమాచల్ రాష్ట్ర ప్రజల అవసరాల నిమిత్తం త్వరితగతిన బస్సులను కొనుగోలు చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్న ఆర్‌టిసి త్వరలో ఆర్డర్ ఖరారు చేయనుంది. 2017లోనూ ఒలెక్ట్రా 25 బస్సులను అందించింది. వాటిని కులు మనాలి రోహ్తాంగ్ మధ్య ఆర్ టి సి నడుపుతోంది. హిమాచల్ కొండల్లో పర్యావరణాన్ని పరిరక్షించడంలో ఒలెక్ట్రా బస్సులు కీలక పాత్ర పోశిస్తున్నాయని ఆ సంస్థ తెలిపింది.

## వారం రోజుల్లో రూ.16 లక్షల కోట్లు ఫట్

### దేశంలో మార్కెట్లను వెంటాడిన యుద్ధ భయాలు

**ముంబయి :**

దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా రెండోరోజూ యుద్ధ భయాలు కొనసాగాయి. చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం, విదేశీ మదుపర్లు తమ ఈక్విటీలను వెనక్కి తీసుకోవడం తదితర పరిణామాలు వారాంతంలోనూ మార్కెట్లను ఉక్కిరిబిక్కిరి చేశాయి. శుక్రవారం ఉదయం ఓ దశలో మార్కెట్లు పుంజుకున్న ప్పటికీ.. మధ్యాహ్నం తర్వాత మళ్లీ అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 809 పాయింట్లు లేదా 0.98 శాతం పతనమై 81,688కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 200 పాయింట్లు లేదా 0.79 శాతం నష్టంతో 25,050 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 800 పాయింట్ల లాభపడి 83,368 గరిష్టాన్ని తాకగా%ౌ% మధ్యాహ్నం తర్వాత 81,533 కనిష్టాన్ని తాకింది. వరుసగా ఐదో సెషన్‌లోనూ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. వారాంతం సెషన్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు అధికంగా నష్టపోయాయి. ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, టిసిఎస్ లాభపడ్డాయి. సెన్సెక్స్‌లో 2384 స్టాక్స్ క్షీణించగా, 1564 సూచీలు లాభపడగా, 106 షేర్లు యథాతథంగా ఉన్నాయి.

## నిఫ్టీ 4.3 శాతం పతనం

ఈ వారంలో ఏ ఒక్క రోజూ సానుకూలత లేకపోవడంతో సెన్సెక్స్ 3,883 పాయింట్లు లేదా 4.5 శాతం క్షీణించగా.. ఎన్ఎస్ఇ 1,128 పాయింట్లు లేదా 4.3 శాతం పతనమయ్యింది. రిలయన్స్ ఇండిస్ట్రీస్ షేర్ 7.31 శాతం పతనమై రూ.2,771.50 వద్ద నమోదైంది. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 4 మధ్య బిఎస్ఇ మార్కెట్ కాపిట లైజేషన్ రూ.16.67 లక్షల కోట్లు హరించుకుపోయి. రూ.461.26 లక్షల కోట్లకు పరిమితమైంది. గత మూడు సెషన్లలో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.3.65 బిలియన్ డాలర్ల (రూ.30వేల కోట్లు పైగా) నిధులను తరలించుకుపోయారు. ఎఫ్ఐఐలు చైనా వైపు మొగ్గు చూపుతున్నాయి.

NEELAGIRI VARTHA TELUGU DAILY
నీలగిరి వార్త
తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# ఆరో రోజూ అమ్మకాల వెల్లువ

### సెన్సెక్స్ 638 పాయింట్ల పతనం

### వీడని యుద్ధ భయాలు

**ముంబయి :**

వరుసగా ఆరో రోజూ దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల జోరు కొనసాగింది. సోమవారం ఉదయం ఆశాజనకంగా లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. ఓ దశలో అమ్మకాలు ముమ్మరంగా సాగడంతో బిఎస్ఇ సెన్సెక్స్ 962 పాయింట్ల పతనాన్ని చవి చూసింది. తుదకు 638 పాయింట్లు లేదా 0.78 శాతం క్షీణించి 81,050కు పడిపోయిం ది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 218 పాయింట్లు లేదా 0.87 శాతం తగ్గి 24,795 వద్ద నమోదయ్యింది. ప్రధానంగా ఎఫ్ఐఐల అమ్మకాలు, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య వీడని ఉద్రిక్తతల భయాలు తదితర కారణాలతో మార్కెట్లు నేల చూపులు చూశాయి. ప్రధాన స్టాక్స్ అయినా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్ 2.09 శాతం, రిలయన్స్ ఇండిస్టీస్ షేర్ 1.17 శాతం పతనం కావడంతో మార్కెట్లపై మరింత ఒత్తిడి చోటు చేసుకుంది. ఎన్‌టిపిసి, యాక్సిస్ బ్యాంక్, ఎల్‌అండ్‌టి, అదానీ పోర్ట్స్ షేర్లు అధికంగా 4 శాతం వరకు విలువ కోల్పోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఐటిసి, భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడిన వాటిలో ఉన్నాయి. బిఎస్ఇలో స్మాల్ క్యాప్ సూచీ 3.86 శాతం, మిడ్ క్యాప్ 2.61 శాతం చొప్పున నష్టపోయాయి.

**తరలిన రూ.37 వేల కోట్ల ఎఫ్ఐఐలు**

గడిచిన ఆరు సెషన్లలో భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.37,000 కోట్ల విలువ చేసే ఎఫ్ఐఐలను తరలించుకు పోయారు. ఆర్థిక వృద్ధి కోసం చైనా కీలక నిర్ణయాలు చేపట్టడమే ఇందుకు ప్రధాన కారనమని నిపుణులు భావిస్తున్నారు. ఇది భారత మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడింది. ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,786 పాయింట్లు క్షీణించింది.



# బిజెపి ఎలాంటి ట్రిక్స్ ప్లే చేయొద్దు: ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్,** నీలగిరి వార్త ప్రతినిధి

జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత జరిగిన ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. ఈసందర్భంగా ఆ పార్టీ నేత, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. ప్రజాతీర్పును గౌరవించాలని, ఎలాంటి కుట్రలు పన్నొద్దని ఆయన అన్ని పార్టీలను కోరారు. లెక్కింపు వేళ మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.'మేం విజయం సాధిస్తామనే ఆశాభావంతో ఉన్నాం. జమ్మూకశ్మీర్ ఓటర్లు తీసుకున్న నిర్ణయం ఈ రోజు తెలుస్తుంది. ఈ మొత్తం పక్రియలో పారదర్శకత ఉండాలి. ప్రజల తీర్పు భాజపాకు వ్యతిరేకంగా ఉంటే వారు ఎలాంటి ట్రిక్స్ ప్లే చేయొద్దు. ఆ పార్టీ ఎలాంటి కుట్రల్లో భాగం కావొద్దు అని వ్యాఖ్యలు చేశారు. రెండు అసెంబ్లీ స్థానాలు గండేర్బల్, బుడ్గామ్ నుంచి పోటీపడిన ఒమర్.. ప్రస్తుతానికి రెండుచోట్ల ఆధిక్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ 40 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా.. భాజపా 25, కాంగ్రెస్ 11, పీడీపీ 5, ఇతరులు 9 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు.

# వినేశ్ ఫోగట్ సంచలన విజయం

## జులానా నుంచి 4వేల ఓట్ల ఆధిక్యంతో గెలుపు

**చండీఘడ్,** నీలగిరి వార్త ప్రతినిధి

హర్యానాలో కాంగ్రెస్ గెలుపు ఆశలు సఫలం కాకపోయినా.. అందరి దృష్టిని ఆకర్షించిన జులానా సీటులో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి, ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫోగట్ ఘన విజయం సాధించారు. మొత్తం 15 రౌండ్లలో వినేశ్ ఫోగట్ 4వేలకు పైగా ఓట్ల ఆధిక్యంలో గెలుపొందారు. ఈ విజయంతో మల్లయోధురాలు వినేశ్ ఫోగట్ ఎమ్మెల్యే అయ్యారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఆధిక్యం కనబర్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఫోగట్.. ఈవీఎం ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్‌లో ముందంజలో దూసుకు పోయారు. ఆ తరువాత రౌండ్లలో స్వల్పంగా వెనకపడ్డారు. మొదటి ఏడు రౌండ్లు పూర్తయ్యేసరికి కొంచెం వెనుకపడిన ఫోగట్.. 8వ రౌండ్ నుంచి ఆధిక్యాన్ని కనబర్చారు. 8,9,10, 11, 12 రౌండ్లలో ఆధిక్యం రావడంతో 12 రౌండ్లు ముగిసే సమయానికి 4వేలకు పైగా ఓట్ల ఆధిక్యాన్ని ఫోగట్ సాధించారు. ప్రస్తుతం ఫలితాల సరళి చూస్తే హర్యానాలో బీజేపీకి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఉంది. ఇప్పటివరకు ఎన్నికల సంఘం అధికారికంగా వెల్లడించిన ఫలితాల ప్రకారం బీజేపీ 49 స్థానాలో, కాంగ్రెస్ 35 స్థానాల్లో, ఐఎన్ఎల్‌డీ ఒకటి, బీఎస్పీ ఒక స్థానంలో ఆధిక్యంలో ఉంది. ఇతరులు నాలుగు స్థానాల్లో ఆధిక్యాన్ని కనబరుస్తున్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే హర్యానాలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. హర్యానాలో ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటినుంచి బీజేపీపై ప్రజలు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారనే ప్రచారం జరిగింది. రైతు ఉద్యమాలు కమలం పార్టీని దెబ్బతీస్తాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత వినేశ్ ఫోగట్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది. బరువు ఎక్కువుగా ఉన్నారనే కారణంగా ఆమె ÷నైల్స్‌లో పాల్గొనలేకపోయారు. దీంతో పతకం లేకుండానే ఒలింపిక్స్ నుంచి వెనుదిరగాల్సి వచ్చింది. ఒలింపిక్స్ తర్వాత ఆమె పేరు ఎక్కువ ప్రచారంలోకి వచ్చింది. అంతకుముందు రెజ్లర్ల ఉద్యమంలో ఫోగట్ కీలకపాత్ర పోషించారు. కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఆమె విమర్శలు చేస్తూ వస్తున్నారు. రైతు చట్టాల విషయంలోనూ, రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఘటనలోనూ కేందప్రభుత్వ వైఖరిని ఆమె తప్పుపడుతూ వచ్చారు. హర్యానా ఎన్నికల వేళ ఫోగట్ కాంగ్రెస్‌లో చేరాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. మరో రెజ్లర్ భజరంగ్ పునియాతో కలిసి ఫోగట్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అప్పటినుంచి ఆమెను బీజేపీ సైతం టార్గెట్ చేసింది. జులానా నియోజకవర్గం నుంచి హస్తం పార్టీ తన అభ్యర్థిగా ఫోగట్‌ను ప్రకటించింది. హర్యానాలో కాంగ్రెస్ వేవ్ ఉందని, మరోవైపు ఫోగట్ హర్యానా బిడ్డ కావడంతో ఆమెపై సానుభూతి ఉందనే ప్రచారం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ వేవ్ కనిపించనప్పటికీ జులనాలో మాత్రం ఫోగట్ విజయం సాధించారు. తన ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి యోగేష్ కుమార్‌పై 4 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

# అసెంబ్లీ ఫలితాల్లో ఆప్‌కు ఆశాభంగం

## రెండు రాష్ట్రాల్లోనూ భంగపాటు

**న్యూఢిల్లీ,** నీలగిరి వార్త ప్రతినిధి

హరియాణా, జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి. హరియాణాలో బీజేపీ దూసుకెళ్తుండగా.. జమ్మూ కశ్మీర్‌లో ఇండియా కూటమి హవా కొనసాగిస్తోంది. అయితే రెండు రాష్ట్రాల్లో ఒంటరిగా బరిలో దిగిన ఆమ్ ఆద్మీ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు షాక్ ఇచ్చాయి. ఇప్పటికే ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్ తమ పరిధిని విస్తరించుకోవాలని చూసిన ఆప్‌కు ఆశాభంగం తప్పలేదు. జమ్మూ, హరియాణా రెండు రాష్ట్రాల్లో ఒక్క స్థానంలోనూ ఆప్ ఖాతా తెరవకపోవడం గమనార్హం. ఇప్పటికే ఢిల్లీలో బీజేపీ నుంచి సవాల్ ఎదుర్కొంటున్న ఆమ్ ఆద్మీ పార్టీకి ఈ ఎన్నికల ఫలితాలు షాక్ ఇచ్చాయని అనుకోవచ్చు. మరికొద్ది రోజుల్లో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలతో పాటు ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో హరియాణా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో ఎదురైన ఫలితాలు ఆప్‌నకు నిరాశ కలిగించడం సాధారణమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. హరియాణాలో తొలుత కాంగ్రెస్‌తో పొత్తు ప్రయత్నాలు జరిగినా సీట్ల పంపకం తేడాతో కాంగ్రెస్‌తో ఆప్ విబేధించింది. రెండు రాష్టాల్లో అన్ని స్థానాల్లో ఆప్ తమ అభ్యర్థులను బరిలోకి దించి ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. తద్వారా ఓట్ల చీలికతో పరోక్షంగా ఎన్డీఏ కూటమికే ఆప్ పోటీ మేలు చేసిందన్న విమర్శలు ఎదుర్కొంటోంది.

# మెహబూబా ముఫ్తీ కూతురు ఓటమి

**శ్రీనగర్**

గుఫ్వారా బిజ్‌బెహరా నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ ఓటమి పాలయ్యారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అభ్యర్థి బషీర్ అహ్మద్ చేతిలో ఓడిపోయారు. ఓటమిని ఆమె అంగీకరించారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. తన గెలుపు కోసం కష్టపడిన పీడీపీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫలితాల ప్రకటనలో ఇసి తీరు అనుమానం

**న్యూఢిల్లీ,**

హర్యానా అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఓవైపు జరుగుతుండగా ట్రెండ్స్‌ను ఈసీఐ వెబ్‌సైట్ తప్పుదారి పట్టిస్తోందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ సంచలన ఆరోపణలు చేశారు. అప్‌డేటెట్ ట్రెండ్స్‌ను చాలా నెమ్మదిగా అప్‌లోడ్ చేస్తోందని విమర్శించారు.

# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలు

## మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు

## నేడు సరస్వతీదేవిగా అమ్మవారి దర్శనం

## పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం చంద్రబాబు దంపతులు

**విజయవాడ,** నీలగిరి వార్త ప్రతినిధి

ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనక దుర్గాదేవి మంగళవారం మహాలక్ష్మి దేవి అలంకారం లో భక్తులకు దర్శనం ఇచ్చింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామునుంచే బారులు దీరారు. దసరా నవరాత్రి ఉత్సవాలు ఆరో రోజు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తును నిర్వహించారు. నవరాత్రులలో ఏడవ రోజు బుధవారం మూల నక్షత్రం కావడంతో అమ్మవారు సరస్వతి దేవి అలంకారం లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారికి బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య ప్రభుత్వం తరపున ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారు.. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆ క్రమంలో ఏడో రోజు అంటే ఆశ్వయుజ మాస శుక్ల పక్ష సప్తమి రోజు దుర్గమ్మవారు.. సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. చదువు, విజ్ఞానం, సంగీతం, కళలకు దేవతగా సరస్వతి దేవిని భక్తితో కొలుస్తారు. ఓం శ్రీసరస్వతీ దేవియే నమ: అనే మంత్రం ఈ రోజు చదువుకోవాలి. ఈ రోజు.. అమ్మవారికి అటుకులు, బెల్లం, శనగపప్పు, కోబ్బరి ప్రసాదంతోపాటు దద్యోజనాన్ని నైవేద్యంగా సమర్పించాలి. ఇక సరస్వతి దేవిని తెలుపు రంగు చీరతో అలంకరిస్తారు. అయితే అమ్మవారి జన్మ నక్షత్రం.. మూలా రోజున అమ్మవారిని దర్శించుకుంటే.. శుభ ఫలితాలు కలుగుతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఇక ఈ రోజు అమ్మవారిని పూజించడం వల్ల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని విశ్వసిస్తారు. శరన్నవరాత్రుల్లో మూల నక్షత్రం రోజు సరస్వతి దేవిని ఆరాధిస్తారు. సప్తమి తిథి సరస్వతి అమ్మవారిది. ఇక అష్టమి దుర్గాదేవి. నవమి, మహార్నవమి మహిషాసుర మర్ధిని పూజిస్తారు. మూల నక్షత్రం ఉన్నప్పుడే సరస్వతి దేవిగా దుర్గమ్మను అలంకరించి.. పూజిస్తారు. మరోవైపు విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో దుర్గమ్మ వారు.. బుధవారం సరస్వతి దేవిగా దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి జన్మ నక్షత్రం రోజు.. లక్షలాది మంది భక్తులు ఇంద్రకీలాద్రికి పోటెత్తనున్నారు. ఇప్పటికే గత ఆరు రోజులుగా వివిధ రూపాల్లో దర్శమిస్తున్న అమ్మవారిని దర్శించుకునేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విజయవాడకు తరలి వస్తున్నారు.

# పిఠాపురం బాలికపై అత్యాచార ఘటన

## తీవ్రంగా స్పందించిన డిప్యూటి సిఎం

## బాలికకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**కాకినాడ,** నీలగిరి వార్త ప్రతినిధి

పిఠాపురంలో బాలికపై అత్యాచారం ఘటనను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. పట్టణానికి చెందిన బాలికకు మద్యం తాగించి మరీ అత్యాచారం చేశారని తెలిసి తీవ్ర మనోవేదనకు గురైనట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. మాధవపురం చెత్త డంపింగ్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ఈ దారుణ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పవన్ చెప్పారు. ఈ అఘాయిత్యం చాలా బాధ కలిగించిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచార సమయంలో అప్రమత్తమైన స్థానికులు నిందితుణ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించడంపై హర్షం వ్యక్తం చేశారు. వారి ద్వారానే ఘటన వెలుగులోకి వచ్చిందన్నారు. లేకుంటే నిందితుడు తప్పించుకునేందుకు ఆస్కారం ఉండేదని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఈ అమానుష చర్యను సభ్యసమాజంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బాలికను పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. బాధితురాలికి, వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని, అతణ్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. స్థానిక జనసేన నాయకులు సైతం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి, సహాయం అందించాలని ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం స్టువర్టుపురం ప్రాంతంలో ఓ బాలిక సోమవారం మధ్యాహ్నం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తోంది. అయితే అదే సమయంలో అటుగా వచ్చిన ఓ మహిళ, మరో వ్యక్తి ఆమె వద్దకు వచ్చి ఆటో ఆపారు. కాగితం చూపిస్తూ అడ్రస్ చెప్పాలంటూ కోరారు. అనంతరం బాలిక ముఖంపై మత్తు మందు స్ప్రే చేశారు. ఆమె స్పృహ తప్పి పడిపోగానే వెంటనే ఆటోలో ఎక్కించుకుని పట్టణ శివారు మాధవపురం డంపింగ్ యార్డుకు తీసుకెళ్లారు. మెలకువ వచ్చిన బాలికకు బలవంతంగా మద్యం తాగించారు. అనంతరం ఆ వ్యక్తి చిన్నారిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక అపస్మారక స్థితికి వెళ్లిపోయింది. చిన్నారి అపస్మారక స్థితికి చేరుకోగానే భయపడిన నిందితులిద్దరూ బాలికను ఆటోలో ఎక్కించే ప్రయత్నం చేశారు. అయితే డంపింగ్ యార్డు వద్దకు వచ్చిన ఓ మహిళ ఈ దారుణ ఘటనను చూసింది. అనుమానం వచ్చి వారిని పలు ప్రశ్నలు అడిగింది. అనంతరం స్థానికులకు సమాచారం ఇచ్చింది. వెంటనే వచ్చిన పలువురు యువకులు ఇద్దరినీ పట్టుకున్నారు. అందరూ కలిసి పోలీసులకు సమాచారం అందించారు. బాలికను గుర్తుపట్టిన కొంతమంది చిన్నారి కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. బాధితురాలిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# లోక్‌సభ ఎనికల పరాభవంతో అప్రమత్తం

## సోషల్ ఇంజనీరింగ్‌పై భారీగా దృష్టి

## ప్రభుత్వ వ్యతిరేకతపై సానుకూల చర్యలు

## హ్యాట్రిక్ విజయం సాధించడంలో బిజెపి సక్సెస్

**న్యూఢిల్లీ,** నీలగిరి వార్త ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికల్లో తగిలిన షాక్ నుంచి హరియాణాలో భాజపా వేగంగా పుంజుకొంది. సామాజిక ఇంజినీరింగ్ నుంచి ఎన్నికల వ్యూహాల వరకు అన్నింటికి పదును పెట్టింది. మోదీ-షా ద్వయం అన్నీ తామై రాష్ట్రంలో పార్టీని నడిపించారు. ఫలితంగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తల్లకిందులు చేస్తూ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో హరియాణాలో సీట్లు తగ్గడంతో భాజపా అప్రమత్తమైంది. దీనిని ఉపేక్షిస్తే.. రాష్ట్రం చేజారే ప్రమాదం ఉందని భావించింది. అభ్యర్థుల ఎంపిక నుంచి కుల సమీకరణల వరకు కసరత్తు చేసింది. ముఖ్యంగా జాతీయ స్థాయి నేతలతోకాకుండా.. రాష్ట్ర స్థాయిలోనే భాజపా ఈ పోరాటం చేయడం విశేషం. ప్రీపోల్స్, పోస్ట్ పోల్ సర్వేలు ప్రభుత్వ వ్యతిరేకత బలంగా ఉందని కోడై కూసినా.. ప్రజలు మాత్రం కమలదళానికే పట్టం కట్టారు. భాజపా సోషల్ ఇంజినీరింగ్ కూడా బలంగానే పనిచేసిందనే ప్రచారం జరిగింది. రాష్ట్రంలో జాట్ వర్గం కాంగ్రెస్ ఛత్రం కింద ఏకమవుతోందని భాజపా గ్రహించింది. దీనికి రెజ్లర్ల ఆందోళన కూడా తోడవడంతో బలమైన ఓబీసీ వర్గాన్ని తమ వైపునకు తిప్పుకొనేందుకు నాయబ్‌సింగ్ సైనీకి అధికార పగ్గాలు అందించింది. దీంతో ఆ రాష్ట్రంలో జాట్ వర్సెస్ ఇతరులు అన్న పోరాటంలో పైచేయి సాధించింది. దీనికి తోడు దళితుల్లో బలమైన జాటవ్‌లు కాంగ్రెస్ పక్షం వహించగా.. వారిలో మిగిలిన కులాలు భాజపా వైపు మళ్లాయి. అగ్రకులాలు, పంజాబీలపై భాజపా ఎక్కువగా ఆధారపడింది. ఈక్రమంలో లోక్‌సభ ఎన్నికల్లో నష్టంతో వెంటనే తేరుకొని.. పార్టీ రాష్ట్ర పగ్గాలను బ్రాహ్మణవర్గానికి చెందిన మోహన్‌లాల్ బదోలికి అప్పగించింది. రాష్ట్రంలో ఈ వర్గం ఓట్లు 7.5శాతం ఉంటాయి. 11 సీట్లను ఈ వర్గానికి కేటాయించింది. సాధారణంగా రాష్ట్రంలోని అగ్రకులాలు, పంజాబీల్లో ఎక్కువ కుటుంబాలు దేశ విభజన తర్వాత వలసవచ్చి స్థిరపడ్డవే. వీరు గ్రాండ్ ట్రంక్‌రోడ్ మార్గంలోని అర్బన్ నియోజకవర్గాల్లో అధికంగా ఉంటారు. 2014, 2019 ఎన్నికల్లో వీరే భాజపాకు మద్దతుగా నిలిచారు. మరోవైపు కాంగ్రెస్ జాట్-దళిత్ కూటమి ఏర్పాటుచేసింది. భాజపా యాంటీ జాట్ కూటమితో హస్తం పార్టీ దూకుడు తగ్గించాల్సి వచ్చింది. ముఖ్యంగా జాట్ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే.. అర్బన్ ఓట్లను కోల్పోవచ్చనే ఆందోళన చెందింది. దీంతో సీఎం అభ్యర్థి పేరు ప్రకటనను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఈ ఏడాది ప్రారంభంలో జేజేపీ హఠాత్తుగా మద్దతు ఉపసంహరించిన సమయంలో పార్టీ అధికారం చేజారకుండా కాపాడుకోగలగడం ఎన్నికల్లో కలిసొచ్చింది. మహిళలు కేంద్రంగా భాజపా ఎన్నికల ప్రచారం సాగింది. ఫలితంగా అతివల్లో ఆ పార్టీపై కొంత సానుకూలత ఉంది. రైతు ఆందోళన వల్ల వచ్చిన ప్రతికూల ఇమేజీ నుంచి బయటపడటానికి ఈ ఏడాది ఆగస్టులో 24 పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని నిర్ణయించింది. ఓ రకంగా ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించిందనే చెప్పాలి. ఈసారి నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి 10 ఇండస్ట్రియల్ కారిడార్లను రాష్ట్రానికి తీసుకొస్తామన్న హామీ యువతపై పనిచేసింది. వీటిద్వారా 50,000 ఉద్యోగాలు ఇస్తామని పార్టీ పేర్కొంది. అగ్నివీర్‌ల అంశం రాష్ట్రంలో కమలం పార్టీని చాలాకాలం ఇబ్బందిపెట్టింది. దీనికి చెక్‌పెడుతూ.. వారికి 10శాతం రిజర్వేషన్లు ఇస్తామనడంతోపాటు.. బ్యాంకు రుణాల మంజూరు సరళతరం చేస్తామన్న హామీ పని చేసింది. నీరజ్ స్వర్ణపతకం సాధించిన తర్వాత ఆ రాష్ట్రంలో స్పోర్ట్స్ కల్చర్‌ను భాజపా సర్కారు బాగా ప్రోత్సహించిందన్న పేరు కూడా యువతలో మంచి ఇమేజీని తీసుకొచ్చింది. టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీం టాప్స్ వంటి అంశాలు కలిసొచ్చాయి. తాజాగా తాము తిరిగి ప్రభుత్వంలోకి వస్తే 'ఒలింపిక్ నర్సరీ'లను ఏర్పాటుచేస్తామని ఆ పార్టీ పేర్కొంది. అసలే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవినీతి తీవ్రంగా ఉందని యువత మథనపడుతుంటే.. ప్రతీ 50 ఓట్లకు ఓ ఉద్యోగాన్ని ఇస్తామంటూ కాంగ్రెస్ నేతలు కొందరు ప్రచారం చేశారు. సిఫార్సుల ఆధారంగా కొలువులంటూ చేసిన ప్రచారం ప్రతిభావంతులైన యువతను భయపెట్టింది. దీనిని భాజపా బలంగా ఓట్ల రూపంలో మలుచుకొంది. మేవాత్‌లో కొంతకాలం క్రితం జరిగిన అల్లర్లతో కొన్ని వర్గాల ఓటర్లు భాజపాకు అనుకూలంగా మారారు. ఎన్నికల్లో భారీ ఎత్తున పాల్గొని ఓటు వేయడం కమలానికి కలిసివచ్చింది. మోదీ ఈ సారి హరియాణాలో ఎన్నికల్లో ర్యాలీలను గణనీయంగా తగ్గించుకొని కేవలం నాలుగుకే పరిమితం చేశారు. ఈ ఎన్నికలను రాష్ట్రస్థాయిలోనే పోరాడేట్లు భాజపా హైకమాండ్ వ్యూహ రచన చేసింది. ప్రభుత్వ వ్యతిరేకతకు కళ్లెం వేసేలా.. ముఖ్యమంత్రి ఖట్టర్‌ను మార్చేసిన భాజపా దాదాపు సగంమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లను నిరాకరించింది. దీంతో ఇప్పటికే స్థానిక ప్రజాప్రతినిధులపై ఉన్న బలమైన వ్యతిరేకతకు చెక్ పెట్టినట్లైంది. మొత్తం 60 మంది కొత్తవారికి అవకాశాలు ఇచ్చింది. మంజూ హుడా, యోగేషన్ బైరాగి, కృష్ణకుమార్, ఆర్తిసింగ్ రావ్ వంటి వారున్నారు. భాజపాకు అహిర్వాల్ బెల్ట్ ఈసారి కూడా బలమైన అండగా నిలిచింది. గురుగ్రామ్, రేవరి, మహేంద్రఘడ్ ప్రాంతాలు దీనిలోకి వస్తాయి. ఈ బెల్ట్‌లోని 28 అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యధికంగా అర్బన్ ఓటర్లు ఉన్నారు. వారు కమలం పక్షం వహించడం కలిసొచ్చే అంశం. 2019లో హరియాణాలో మిగిలిన ప్రాంతాల్లో సీట్లు తగ్గినా.. ఈ ప్రాంతం మాత్రం గతం కంటే ఒకటి ఎక్కువే భాజపాకు అందించింది. లోక్‌సభ ఎన్నికల్లో గురుగ్రామ్, రోహ్‌తక్, భివానీ-మహేంద్రఘడ్‌లోని 11అసెంబ్లీ సెగ్మెంట్లలో 10 కమలం పక్షమే వహించాయి.

Printed, Published and Owned by GUNTOJU VISHNUMURTHY, Printed at V.M PRINTERS Plot.no.108, shivashakar colony, kuntloor (vill) Abdullapurmet(md) Dist. Rangareddy Telangana, Published at V.M PUBLCATIONS Plot.no.108, shivashakar colony, kuntloor (vill) Abdullapurmet(md), Dist.Rangareddy, Telangana state pin : 501505. Editor : GUNTOJU VISHNUMURTHY, RNI NO. APTEL/31957/2009, cell no.9676549223

NEELAGIRI VARTHA TELUGU DAILY neelagirivartha@gmail.com

నీలగిరి వార్త

తెలుగు దిన పత్రిక

మన కోసం మన వార్త

తెలంగాణ ఉమ్మడి జిల్లాలు

బుధవారం 09-10-2024





# పోలవరం ప్రాజెక్ట్‌కు కేంద్రం నిధులు మంజూరు

ఏలూరు జిల్లా నిలగిరి వార్త ప్రతినిది

పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర జలవనరులశాఖ మంత్రి సి. ఆర్ పాటిల్ , రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలిపిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్.

ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.2800 కోట్ల నిధుల విడుదల చేయడం పట్ల ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పాత బిల్లుల రీయింబర్స్మెంట్ కింద రూ. 800 కోట్లు, అడ్వాన్సుగా పనులు చేపట్టేందుకు రూ.2,000 కోట్లు ఇవ్వడాన్ని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్వాగతించారు. 2014లో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం నిధులు రీయింబర్స్ చేస్తూ వస్తోందని, అయితే అడ్వాన్స్ ఇచ్చేందుకు తొలిసారిగా అంగీకారం తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రజల తరపున పుట్టా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పోలవరం ప్రాజెక్టు సాకారం దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని, రూ. 30,436 కోట్లతో ప్రాజెక్టు కొత్త డీపీఆర్ కు (సమగ్ర పథకం నివేదిక) కేంద్ర ప్రభుత్వం నెల రోజుల కిందటే ఆమోదించిందని, ఫలితంగా గతంలో ఇచ్చిన నిధులు పోనూ రూ. 12,157 కోట్లు కేంద్రం నుంచి అదనంగా పొందేందుకు అవకాశం లభించిందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.స్వర్ణాంధ్ర రథసారథి, అపర భగీరధుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి కృషి ఫలించిందని, నిధులు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, అధినేత నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు చేసిన కృషిని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కొనియాడారు.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 6 వేల కోట్లు, వచ్చే ఏడాది రూ. 6,157 కోట్లు మంజూరు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రూ.7 వేల కోట్ల వరకు అవసరమని పోలవరం ప్రాజెక్టు అధికారులు చెబుతున్న విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు..

ప్రస్తుతం కొత్త డీపీఆర్ ఆమోదం పొందడంతో అందులో నిధులు తీసుకునేందుకు వెసులుబాటు లభించిందని, దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిన బిల్లులు రూ. 800 కోట్లు రీయింబర్స్ చేసినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన తర్వాత కేంద్రం ప్రభుత్వం ఇంత వేగంగా సానుకూల నిర్ణయాలు తీసుకోవడం, నిధులు మంజూరు కావడం ఇదే తొలిసారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు.భవిష్యత్తులో కూడా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర జలవనరుల శాఖామంత్రి సి. ఆర్. పాటిల్ గారు, రాష్ట్రంలోని నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు.కూటమి ప్రభుత్వానికి మద్దతుగా అడిగిన వెంటనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోడీ కి, జలవనరుల శాఖ మంత్రి శ్రీ సి. ఆర్. పాటిల్ కి, రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఏడుపదుల వయసులో కూడా తీవ్రంగా శ్రమిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కి, కూటమిలో భాగస్వామి అయిన జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ కి, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, ఎంపీలను వెన్నుతట్టి ప్రోత్సాహిస్తున్న యువనేత, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ కి, ఎంపీ శ్రీ పుట్టా మహేష్ కుమార్ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

# స్వదేశీ మేళా బ్రోచర్లను విడుదల చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

హైద్రాబాద్ పీపుల్స్ ప్లాజా లో అక్టోబర్ 23 నుండి 27వ తేదీ వరకు నిర్వహించబోయే స్వదేశీ మేళా బ్రోచర్ల ను విడుదల చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే, శాసన సభా పక్ష ఉపనేత కాటిపల్లి వెంకటరమణారెడ్డి.

కామారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అక్టోబర్ 23 నుండి 27 తేదీ వరకు స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబోయే స్వదేశీ మేళా బ్రోచర్ల ను కామారెడ్డి ఎమ్మెల్యే, శాసనసభా పక్ష ఉపనేత కాటిపల్లి వెంకటరమణారెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వావలంబి భారత్ అభియాన్ దిశగా ఐదు రోజులపాటు జరిగే ఈ మేళాలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. తాను కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర సంఘటనా మంత్రి రచ్చ శ్రీనివాస్ జీ మాట్లాడుతూ సరేసి జాగరణ మంచ్ సామాజిక సాంస్కృతిక ఆర్థిక రంగ నిపుణుల యొక్క వేదిక ని, దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ ప్రభావాలు, నూతన సరళీకృత విధానాలను వ్యతిరేకిస్తూ భారతదేశ ఆర్థిక వ్యవస్థలో అన్ని రంగాలవారికి ప్రయోజనాలు చేకూర్చేలా స్వావలంబన విధానాలు రూపకల్పన చేసేందుకే స్వదేశీ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా నిరంతరం ప్రజలను జాగృత పరచడానికి గాను ముఖ్యంగా



వ్యవసాయం,చేనేత,వస్త్ర, హస్త కళల ఉత్పత్తులు, సూక్ష్మ చిన్న తరహా పారిశ్రామిక రంగ ప్రోత్సాహకాలు, ఆయుర్వేదిక్, హోమియోపతి ఫార్మా రంగ, మత్స్య, పాడి పరిశ్రమ,స్వయం ఉపాధిని ప్రోత్సహించే రంగాల స్టాళ్లు ఈ మేళాలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.వికసిత భారత్ లక్ష్యంగా కొనసాగుతున్న ఈ మేళాలో ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు,చర్చ సదస్సులు కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. స్వదేశీ మేళా ప్రారంభ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు, ప్రముఖ సినీ రచయిత వి.విజయేంద్ర ప్రసాద్,చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. బ్రోచర్ విడుదల కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్ సోని, ఇందూర్ విభాగ్ కో కన్వీనర్ రాజాగౌడ్,జిల్లా కన్వీనర్ డా.రాహుల్, ప్రతినిధులు డా.యాలాద్రి, మనీష్,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నల్లగుంట్ల, కొర్రపోలు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం





పెద్ద దోర్నాల నీలగిరి వార్త అక్టోబర్ 8.

దోర్నాల మండలం నల్లగుంట్ల, కొర్రపోలు గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం జరిగింది. మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ గ్రామాలలో సాగుచేసిన కంది, మిరప,పంటలను పరిశీలించామన్నారు. కందిలో ఆకు చుట్టు పురుగు, ఎం డు, తెగుళ్లును గుర్తించడం జరిగిం దన్నారు. కందిలో ఆకు చుట్టు ఆకులను, పూతను, చుట్ట చుట్టుకొని లోపల ఉండి గిరి తింటుంది అన్నారు. నివారణ కొరకు క్లోరో ఫైరి పోస్,2-5ఎంఎల్ వేప గింజల కషాయము5ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఎండు తెగులు నివారణ కొరకు కాపర్ ఆక్స్ క్లోరైడ్ 3ఎంఎల్ లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నల్లేరు కషాయం చేయు , విధానం గురించి ఏపీ సీఎన్ఎఫ్. సిబ్బంది, రైతులకు తెలియజేశారు అన్నారు. వి.హెచ్.ఏ.మల్లు నాయక్,ఎన్జీవో సిబ్బంది,రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి దేవి అలంకరణలో భ్రమరాంబికా దేవి, భక్తులకు దర్శనము

పెద్ద దోర్నాల నీలగిరి వార్త అక్టోబర్ 8.



పెద్ద దోర్నాల మండలం వై. చెర్లోపల్లి గ్రామము, మోట్ల మల్లికార్జున పురమునందు వెలసిన భ్రమరాంబికా దేవి సమేత సిద్ధ మల్లికార్జున స్వామి దేవస్థానమునందు, దేవీ శరణ నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజు మహాలక్ష్మి దేవి అలంకరణలో భ్రమరాంబికా దేవి మంగళవారము భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దాతలుగా తిమ్మాపురం గ్రామ వాస్తవ్యులు,నారా.వెంకట రమణయ్య, ధర్మపత్ని రామలక్ష్మి కుమారి వారి సుపుత్రుడు గోపి సాయి జగదీష్ లు ఆలయ పూజారి అశ్విని కుమార్ వేదమంత్రాలతో, కుంకుమభిషేకం లలితా సహస్రం, ఖడ్గ సోత్రం లతో, కుంకుమాభిషేకములు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ,భక్తులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.వీరందరికీ తీర్థ ప్రసాదములు పంపించేశారు.

# కేజీబీవీ నాన్ టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు : మండల విద్యాధికారి

నందవరం నీలగిరి వార్త(08అక్టోబర్)



నందవరం మండల కేంద్రమైన నందవరం కస్తూరిబా గాంధీ గురుకుల విద్యా నిలయము నందు అవుట్ సోర్సింగ్ విధానంలో 4 నాన్ టీచింగ్ ఉద్యోగాలకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని మండల విద్యాధికారి సుదర్శన్ రెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపల్ ఆర్ శైలజ లు తెలిపారు. మంగళవారం పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నందవరం కస్తూర్బా పాఠశాలలో హెడ్ కుక్ , స్కావెంజర్ , స్వీపర్ మరియు డే అండ్ నైట్ వాచ్ మెన్ పోస్టులలో ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నాయని, హెడ్ కుక్, స్కావెంజర్, స్వీపర్ పోస్టులకు ఎటువంటి విద్యార్హతలు లేకున్నప్పటికిని దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. కానీ డే అండ్ నైట్ వాచ్ మెన్ కు మాత్రం కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. పైన తెలిపిన ఉద్యోగాలన్నిటికీ మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. 01-07-2024 నాటికి ఓసి మహిళలైతే 42 సంవత్సరాలు మించరాదు ఎస్సీ,ఎస్టీ,బీసీలకు 47 సంవత్సరములు లోపు ఉండాలన్నారు. అర్హులైన మహిళలు ఈనెల ఏడో తేదీ నుండి 15వ తేదీ లోపల సంబంధిత ప్రింటెడ్ దరఖాస్తును తీసుకొని దరఖాస్తు తో పాటు విద్యా అర్హతల సర్టిఫికెట్స్ మరియు రేషన్ కార్డు,ఆధార్ కార్డు,కులం,ఆదాయం ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను జతపరచి నందవరం మండల విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 15 లోపల సమర్పించాలన్నారు.వివరాలకు మండల విద్యాధికారి కార్యాలయమును సంప్రదించాలి

# నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి



ఎమ్మిగనూరు నీలగిరి వార్త (08 అక్టోబర్)

ఎమ్మిగనూరు పట్టణం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా కూటమి ప్రభుత్వం త్వరలోనే ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు ఎమ్మిగనూరు ఆర్టీసీ నూతనంగా నాలుగు బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ మేరకు బస్సును ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒక బస్సు గానీ ట్రైన్ గాని తెచ్చిన దాఖలాలు లేవన్నారు ఎమ్మిగనూరు ఆర్టీసీ బస్టాండ్ ను నా తండ్రి మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు ఆర్టీసీ బస్టాండ్ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆశావర్కర్ల డిమాండ్ల నెరవేర్చాలి: సిఐటియు






నందవరం నీలగిరి వార్త (08 అక్టోబర్)

నందవరం మండలం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని సిఐటియు తాలూకా కార్యదర్శి రాముడు ఆశ వర్కర్లు అన్నారు ప్రభుత్వ ఆసుపత్రినందు ఆశ వర్కర్లు నిరసన చేపట్టారు వైద్య అధికారిని శ్రీలేఖకు వినతి పత్రాన్ని అందజేశారు అదేవిధంగా హాలహర్వి గ్రామంలో ఆశ వర్కర్ల యూనియన్ సిఐటియు నిరసన చేపట్టి వైద్య అధికారులు డాక్టర్ పరిమిళ డాక్టర్ విజయభారతి లకు వినతి పత్రాన్నిఅందించారు ఆశ వర్కర్లు సిఐటియు తాలూక కార్యదర్శి రాముడు ఈ సందర్భంగా మాట్లాడారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్లను శ్రమ దోపిడి చేస్తున్నాయని అన్నారు.ఆశ వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలి పని భారం తగ్గించాలి మెడికల్ ఆఫీసర్లు టార్గెట్ పనుల విధానాన్ని రద్దు చేయాలని కోరారు.ఆశ వర్కర్ల రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకి పెంచాలి.వారసత్వ హక్కు కల్పించాలి ఆశ వర్కర్లు మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.రాత్రి వేళలో హాస్పటల్ నందు రూములు కేటాయించాలి ఆశ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి ప్రభుత్వాలు ఒప్పందం చేసుకున్న జీవోల ను అమలు చేయాలి తదితర ఆశ వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో జి.రామేశ్వరి సి.చిట్టెమ్మ బి. నాగవేణి కె.భూలక్ష్మి లలిత పరిమళ సుజాత రోజా ధనలక్ష్మి శిరీష పుష్ప తదితర ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# తీన్మార్ చంద్రవ్వతో మున్సిపల్ చైర్మన్ బతుకమ్మ సంబరాలు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

కామారెడ్డి పట్టణంలో మంగళవారం బతుకమ్మ పండుగ సందర్భంగా వి6 ఫేమ్ తీన్మార్ చంద్రవ్వతో కలిసి మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ బతుకమ్మ సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# అధికారికంగా బతుకమ్మ వేడుకలు నిర్వహణ: జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

బతుకమ్మ వేడుకలను మండల, జిల్లా కేంద్రాలలో ఘనంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం రోజున కలెక్టరేట్ లోని మినీ సమావేశమందిరంలో బతుకమ్మ వేడుకలు నిర్వహణపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ వేడుకలను అధికారికంగా జిల్లాలో నిర్వహించాలని, మండల, జిల్లా కేంద్రాలలో మహిళలను పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చూడాలని, జిల్లా వ్యాప్తంగా ఘనంగా సాంప్రదాయ రీతిలో పాటలు పాడుతూ బతుకమ్మ ఆటను ఆడే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులను బతుకమ్మ వేడుకల్లో భాగస్వాములు చేయాలని అన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకను పెద్ద ఎత్తున నిర్వహించాలని అన్నారు. చెరువులు, కుంటలు తదితర నీటి ప్రాంతాలలో గజ ఈత గాళ్లను నియమించాలని సూచించారు. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో శానిటేషన్ పనులు, విద్యుత్ లైట్ లను, షామియానాలు, తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులను బతుకమ్మ వేడుకల్లో పాల్గొని విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. శాఖల వారీగా అవేర్నెస్ కార్యక్రమాలను కూడా నిర్వహించాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, డిఎస్పి నాగేశ్వర్ రావు, జిల్లా సంక్షేమ అధికారి బావన్న, జిల్లా ప్రణాళిక అధికారి రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమీషనర్ సుజాత, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడం బాధాకరం టి ఎస్ ఐ డి సి మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్...





**జహీరాబాద్ నీలగిరి వార్త 08:** న్యాల్కల్ మండలం గణేష్ పూర్ గ్రామానికి చెందిన నలుగురు బైక్ పై ప్రయాణించే క్రమంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టడంతో నలుగురు మృత్యువాత పడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యులు మరణించారనే విషయాన్ని తెలుసుకున్న టి ఎస్ ఐ డి సి మాజీ చైర్మన్ మొహమ్మద్ తన్వీర్ అంతక్రియల్లో పాల్గొని శోకసంద్రంలో మునిగిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు న్యాల్కల్ మండల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చంద్రప్ప, కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ గౌసుద్దీన్ పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి తీరుపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపండి

## ముదిగొండలో ఎమ్మార్పీఎస్ అత్యవసర సమావేశంలో నూకల నాగేశ్వరరావు మాదిగ



**ముదిగొండ నీలగిరి వార్త అక్టోబర్ 8.** మండల కేంద్రమైన ముదిగొండలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో పాడిశాల నాగేశ్వరరావు మాదిగ అధ్యక్షతన మంగళవారం జరిగిన అత్యవసర సమావేశానికి మండల ఇంచార్జ్ నూకల నాగేశ్వరరావు మాదిగ, కో-ఇంచార్జ్ లంజపల్లి భద్రం మాదిగలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు శ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం వర్గీకరణ లేకుండా డీఎస్సీ ఫలితాలను ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రేపు బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ఉదయం 11 గంటలకు జడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం నుండి ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ఎత్తున నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి మాదిగలు, ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత, మహిళలు, విద్యావంతులు, డీఎస్సీ అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల ఎంఎస్పి సీనియర్ నాయకులు కట్టకూరు సురేష్ మాదిగ, ఇరుకు రమేష్ మాదిగ, బొడ్డు అనిల్ మాదిగ, గుర్రం సంగయ్య మాదిగలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో శరన్నవరాత్రి వేడుకలు





**ఎల్బీనగర్ నీలగిరి వార్త (అక్టోబర్8):** ఎల్బీనగర్ నియోజకవర్గం బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర కాలనీ, చంపాపేట డివిజన్ లోని శుభోదయ కాలనీలో నెలకొల్పిన అమ్మవారి మండపాలలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేసిన ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, రాజిరెడ్డి, సుమన్ గౌడ్,రవి ముదిరాజ్, శ్రీనాథ్,సదానంద్ రెడ్డి, రాఘవేంద్రరావు,సతీష్,చరణ్, ఉమ మహేశ్వర్ మరియు పలువురు నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో మూడు నాళ్ళ ముచ్చటగా ట్రాఫిక్ సిగ్నల్స్

- పట్టించుకొని సంబదిత అధికారులు...
- నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు డివేడర్ పై, విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సిలు..
- సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సిములు ఆరోపణ...




**జహీరాబాద్ నీలగిరి వార్త 08:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణములోని ట్రాఫిక్ సిగ్నల్ మూడు నాళ్ళ ముచ్చటగా మారిందని సీపీఐ డివిజన్ కార్యదర్శి కె.నర్సిములు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ పేర్కొన్నారు. రోజు రోజు కు జహీరాబాద్ పట్టణం విస్తరించడంతో ప్రజానీకం పెరిగిపోతోందని జహీరాబాద్ పట్టణం పెద్ద పారిశ్రామిక ప్రాంతంగా ఎదుగుతుందని అందులో జహీరాబాద్ నియోజక వర్గ ప్రజలు రోజు వారీ పనుల మీద కూలి పనుల వారు వ్యాపారస్తులు ఉద్యోగస్తులు వారి పనుల మీద జహీరాబాద్ పట్టణానికి రోజు వస్తుంటారు. పోతుంటారు...కానీ సమస్య పరిష్కరించడంలో అధికారులు విఫలం అయ్యారని ఆయన అన్నారు. పట్టణంలో హైవే రోడ్డు, భవాని మందిర్ రోడ్డు, బ్లాక్ రోడ్డు, హన్మహన్ మందిర్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, వివిధ కూడలిలో జనం విపరీతంగా ఉంటున్నారని ఆయన అన్నారు. అదే విదంగా నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు డివేడర్ పై, విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సి కట్టడం వాటిని నెలల తరబడి తొలగించక పోవడం వలన ప్రజలు రోడ్డు దాటడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కో సమయంలో రోడ్డు దాటుతున్నపుడు ఫ్లెక్సిలు అడ్డంగా ఉండటంతో అక్కడ నుండి వచ్చి వాహనాలు కనిపించక జనాలు రోడ్డు దాటుచున్నపుడు ఆక్సిడెంట్ లు జరిగి ప్రమాదాలకు దారి తిస్తున్నాయని ఆయన అన్నారు. లక్షలు వెచ్చించి ట్రాఫిక్ సిగ్నల్ ను ఏర్పాటు చేసిన ఉపయోగము లేదని చెడిపోయి సంవత్సరం కావస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం సరైనది కాదని సిగ్నల్స్ లేకపోవడంతో ప్రజలు రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డు మీదకు రావాల్సి వస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం కాదు ముందు ప్రజలకు కావల్సిన సదుపాయాలు ఏమి కావాలో చూడాలని ముందుగా ట్రాఫిక్ సిగ్నల్స్ ను ప్రారంభించి ట్రాఫిక్ ను నియంత్రించండి అప్పుడు గొప్పలు చెప్పుకోండి అని ఆయన హితావు పలికారు. జహీరాబాద్ పట్టణంలో ప్రభుత్వ నిధులు ఏమవుతున్నాయో అధికారులకే తెలుసు కానీ ఎక్కడ పట్టణం అభివృద్ధి చేయడంలేదని ఆరోపించారు. జహీరాబాద్ పెద్ద పారిశ్రామిక వాడ జహీరాబాద్ పట్టణానికి ఎన్ని అయిన నిధులు తెస్తామని చెపుతున్న నాయకులు మరి రోడ్డు పై ట్రాఫిక్ సిగ్నల్స్ కనబడడం లేదా మునిసిపల్ అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫ్లెక్సీ పెట్టుకోవడానికి మునిసిపల్ పర్మిషన్ తీసుకోవాలి వాటికి పొడవు, వెడల్పుల ప్రకారం అమౌంట్‌ను నిర్ణయించాలి. దానివలన మునిసిపల్ ఆదాయానికి గండి పడుతుందని ఆయన అన్నారు. వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్ ను ప్రారంభించాలని లేకుంటే సీపీఐ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

- ప్రస్తుతం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సదరు వ్యక్తి..
- చిరాగ్ పల్లి ఎస్ ఐ రాజేందర్ రెడ్డి



**జహీరాబాద్ నీలగిరి వార్త 08:** సంగారెడ్డి జిల్లా చిరాగ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గుర్తు తెలియని వాహనం ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఢీ కొనడంతో ఆ వ్యక్తి తీవ్ర గాయాలతో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని చిరాగ్పల్లి ఎస్ ఐ రాజేందర్ రెడ్డి ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. వారు వెల్లడించిన సమాచారం మేరకు... తేది 07.10.2024 రాత్రి సమయంలో సత్వర్ గ్రామ శివారులో గల సత్యం ధాబా సమీపంలో ముంబై వైపు పోవు జాతీయ రహదారి-65 పై ఒక గుర్తు తెలియని వాహనం, ఒక గుర్తు తెలియని ఒక మగ మనిషి వయస్సు: సుమారుగా 28 నుండి 35 సంవత్సరాలు ఒక గుర్తు తెలియని వాహనము యొక్క డ్రైవర్ అతివేగంగా అజాగ్రతగా నడిపి టక్కరు ఇవ్వగా అట్టి గుర్తు తెలియని వ్యక్తి తలకు మరియు ఇతర శరీర భాగాలలో బలమైన రక్త గాయాలైనాయని, అట్టి వ్యక్తి ప్రస్తుతం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి జహీరాబాద్ లో చికిత్స పొందుతున్నాడని వారు తెలిపారు. ప్రమాదానికి గురైన వ్యక్తి బూడిద రంగు టీ షర్ట్, నెక్కర్ ధరించి యున్నాడని, ఇట్టి వ్యక్తి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు 8712656766 ఈ నెంబర్ కు సమాచారం ఇవ్వగలరని వారు కోరారు.

# అల్గోల్ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ






**జహీరాబాద్ నీలగిరి వార్త 08:** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని నలుగురు దొంగలు చోరీకి పాల్పడ్డారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ గ్రామం లోని రేణుక ఎల్లమ్మ గుడిలో అమ్మవారి నగలు, కిరీటం, తాళిబొట్టు తో పాటు హుండీ పగుల గొట్టి సుమారు 25వేల రూపాయలను దోచుకొని వెళ్లారు. గుడిలో ఉన్న సీసీ కెమెరాలు,టీవీతో పాటు, భజన సామాగ్రి మొదలైన వాటిని ధ్వంసం చేశారని గ్రామస్థులు తెలిపారు. అనంతరం ఆ దొంగలు గ్రామంలోకి వెళ్లి ఇళ్లలో చోరికి పాల్పడగా అక్కడ ఉన్న వారు కేకలేయడం తో వారు పరరయ్యారు. దేవాదాయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పోలీసులకు ఫిర్యాదు చేశామని, గతంలో సైతం ఇలాంటి దొంగతనాలు జరిగాయని అప్పుడు కూడ పోలీసులకు సమాచారం ఇచ్చామని వారు తెలిపారు. దొంగతనం చేస్తున్న దృశ్యాలు ఆలయంలో ఏర్పాటు చేసిన సీ సి టివిలో రికార్డ్ అయ్యాయి. దేవాలయ కమిటీ సంచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణ ఎస్ఐ కాశీనాథ్ మాట్లాడుతూ సి సీ టివి పుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. సీసీ టివి పూటేజ్ లోని నలుగురు వ్యక్తుల మాస్కులు ధరించి యున్నారని, వారి ఫోటోలు పబ్లిష్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి వ్యక్తులను ఎవరైనా గుర్తించినచో పోలీసు వారికి సమాచారం ఇవ్వవలసినదిగా కోరారు. అట్టి సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషకం పోలీసు వారిచే ఇవ్వబడుతుందని ప్రకటించారు. అదేవిధంగా దసరా పండుగ సమయంలో ప్రజలు ఇంటికి తాళాలు వేసి ఊరుకి వెళ్లాల్సి వస్తే.. తమ విలువైన వస్తువులు తమ వెంటనే తీసుకొని వెళ్లాలని, ప్రక్కింటి వారికి అలాగే పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని సూచించారు. పోలీసులు వారికి సమాచారం ఇచ్చినచో అలాంటి ప్రదేశాలలో పోలీసు వారు తగిన నిఘా పెట్టుతారని తెలిపారు.

# మెగా జాబ్ మేళా



**హయత్ నగర్ నీలగిరి వార్త (అక్టోబర్ 8):** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఇంజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యూస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తనయుడు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి ,తుర్కయంజాల్ మున్సిపల్ ఛైర్పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామ్ రెడ్డి , వైస్ ఛైర్పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్ ,వనస్థలిపురం ఏసీపీ కాశి రెడ్డి , వనస్థలిపురం సీఐ అశోక్ రెడ్డి , కౌన్సిలర్లు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్ , కుంట ఉదయశ్రీ ,మర్రి మాదవి , నక్క శివ లింగం , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ చారి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ గౌస్ పాషా , రంగా కృష్ణ గౌడ్ , గ్రామ ప్రజలు మరియు యువతి యువకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

# గుబ్బడి పతేపూర్ గ్రామంలో పిడిఎస్ రైస్ పట్టివేత



**నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి** అక్రమంగా పిడిఎస్ రైసు తరలిస్తుండగా టాస్ఫోర్స్ అధికారులకు పట్టుబడిన సంఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కే అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని గుబ్బడి పత్తేపూర్ గ్రామంలో పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా టాస్క్ ఫోర్స్ అధికారులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా 5 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న మహేంద్ర ట్రాలీ ఆటోను పట్టుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# సాంబ కేశవ ఆలయంలో చెస్ పోటీల నిర్వహణ





**ఎల్కతుర్తి మండలం నీలగిరి వార్త ప్రతినిధి సెప్టెంబర్ 08** దుర్గా దేవి నవరాత్రుల సందర్భంగా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలోని సాంబ కేశవ ఆలయంలో నెలకొల్పిన టువంటి అమ్మవారి నవరాత్రుల సందర్భంగా చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుంది ఈ సందర్భంగా వెలిశెట్టి వంశి మాట్లాడుతూపిల్లలకి చదువుతోపాటు ఆటలలో కూడా ఆసక్తి కలిగేలా చేయాలి తద్వారా వారికి మెదడుకు పదును పెట్టడం వలన ఆలోచన శక్తి పెరుగుతుంది అంతే కాకుండా పిల్లల్ని చెడు త్రోవలు పట్టకుండా చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది మరియు మెదడుకు సంబంధించిన చెస్ లాంటి ఆటలే కాకుండా మంచి పుస్తకాలను వారికి అందించి వారి మేధస్సును పెంచాలి ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో పిల్లల్ని చదువులోనైనా ఆటలలోనైనా ముందుండే ప్రయత్నం చేయాలి దానికి పూర్తి బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని వారు పత్రిక విలేకరుల ముందు చెప్పారు.

# ప్రకృతికి ప్రశాంతతకు దత్తగిరి నిలయం

## - మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్



**జహీరాబాద్ నీలగిరి వార్త 08:** ప్రశాంతమైన వాతావరణం, మానసిక ప్రశాంతతకు దత్తగిరి మహారాజ్ ఆశ్రమం నిలయమని భాజపా మల్కాజ్గిరి ఎంపీ రాజేందర్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని వారి నివాసంలో బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, విశ్వ మానవ ధర్మ ప్రచార సంఘం ఉపాధ్యక్షులు శేరీ నార్సింగ్ రావుతో కలిసి దసరా ఉత్సవాలకు వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ తను ఆశ్రమాన్ని సందర్శించినప్పుడు ఆశ్రమంలో కొనసాగుతున్న వైదిక పాఠశాల, రాసి నక్షత్రవనం, ఎటు చూసినా పచ్చని చెట్లను చూసి సంతోషించానన్నారు. తిరిగి మళ్లీ ఆశ్రమాన్ని సందర్శిస్తానన్నారు.

# కన్య పూజ నిర్వహించడం జరిగింది



**మల్కాజ్గిరి నీలగిరి వార్త ప్రతినిధి** న్యూ విద్యా నగర్ కాలనీలో నవదుర్గా అసోసియేషన్ వారి తుపాకుల జనార్ధన్ అధ్వర్యంలో కన్య పూజ కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో భవాని మాల ధరణ వేసిన భవానిలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నేరేడ్మెట్‌లో రావణమేల ఏర్పాట్లను పరిశీలించిన నేరేడ్మెట్ సిఐ , మల్కాజిగిరి ట్రాఫిక్ సిఐ

**మల్కాజ్గిరి నీలగిరి వార్త ప్రతినిధి**







నేరేడ్మెట్‌లోని శ్రీ కాశీ విశ్వనాధ ఆలయ సమీపంలో మహాశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 23 సంవత్స రాలగా కల్చరల్ ప్రోగ్రాం , కళాభారతి కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావణ మేళ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా నేరేడ్మెట్ సి ఐ సందీప్ కుమార్ , మల్కాజిగిరి ట్రాఫిక్ సి ఐ నర్సింహ రావణ మేళ జరిగే స్థలాన్ని పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి నిర్వాహకులకు సూచనలు చేశారు. నెరెడ్మెట్ సి ఐ సందీప్ కుమార్, మల్కాజిగిరి ట్రాఫిక్ సి ఐ నరసింహ మాట్లాడుతూ మహాశక్తి యూత్ అసోసియేషన్ , కళా భారతి కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా పండుగని పురస్కరించుకొని జరిగే రావణ మేళ కి ఎటువంటి ఆటంకాలు జరగకుండా భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నాం అలాగే నేరేడ్మెట్ నుంచి మల్కాజిగిరి వెళ్ళే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు ఇబ్బంది పడకుండా ఓల్డ్ పి ఎస్ నుంచి దీన్ దయాల్ నగర్ , సంతోషిమానగర్ , కృప కాంప్లెక్స్ మీదుగా ట్రాఫిక్ డైవర్సన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు , మరియు లా అండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయం చేసుకుంటూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తాం అని అన్నారు.శ్రీ కాశీ విశ్వనాధ ఆలయంలో సీఐ సందీప్ కుమార్ కి , మల్కాజిగిరి ట్రాఫిక్ సి ఐ నర్సింహ ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గంగాధరి కృష్ణ, ఎలిమెల జ్ఞానేశ్వర్, పి ఎస్ శ్రీనివాస్,జంగిలి శివకుమార్, నరేష్ జన్ను, ఎలిమెల ప్రశాంత్, కే నరేష్, ఏ లక్ష్మీపతి, ఏ ఎస్ లక్ష్మణరావు, జిఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# అంతా మా ఇష్టం మమ్మల్ని అడ్డుకునే వారెవరు ?

### చోద్యం చూస్తున్న జి హెచ్ ఎం సి అధికారులు

### ఫిర్యాదు చేసిన జనం కోసం అధ్యక్షుడు

శేరిలింగంపల్లి నీలగిరి వార్త



చందా నగర్‌లో స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి ట్రాఫిక్ ఇబ్బందులకు గురి చేస్తున్న పి ఆర్ కె హాస్పిటల్ నడుస్తున్న బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణము పై తగిన చర్యలు పి ఆర్ కె హాస్పిటల్ రోడ్డు ను కబ్జా చేసి తీవ్ర ఉల్లంఘున కు పాల్పడడం కాకుండా రోడ్డు మీద నే అంబులెన్స్ లతో పాటు హాస్పిటల్ ఉద్యోగుల వాహనాలు కూడా రోడ్డు పైనే ఉంచడం హాస్పిటల్ హైవేపై న ఉండడంతో పాటు మంజీర రోడ్డులో కూడా అత్యంత రద్దీగా ఉండడం వల్ల గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది అని జనం కోసం అనేక మార్లు చందా నగర్ సర్కిల్ 21 లో అధికారులకు వినతి పత్రాలు, సమాచారా హక్కు చట్టం కింద సమాచారాన్ని అడిగిన ఎలాంటి చర్యలు, సమాచారం ఇవ్వలేదని అంటే పెద్దవాడు చట్ట విరుద్ధంగా ఏ పని చేసినా అధికారులు సహకరించడం ఆనవాయితీగా వస్తున్నది ఈ పి ఆర్ కె హాస్పిటల్ కూడ మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తున్నది అని జనం కోసం అధ్యక్షుడు కసి రెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరు మీదట బడా బాబులకు చుక్కలు చూపిస్తుంటే చందా నగర్ సర్కిల్ 21 అధికారులకు బడా బాబులకు అడుగులకు మడుగులు వత్తడం గర్హనీయం మన విషయం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పి ఆర్ కె హాస్పిటల్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జనం కోసం అధ్యక్షుడు కసి రెడ్డి భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# అక్టోబర్ మాసంలో జిల్లాలో సదరం క్యాంపులు

### -వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి

వికారాబాద్ జిల్లాలో వికలాంగుల కొరకు ఈ నెల సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తెలిపారు. ఈనెల తాండూరు ప్రభుత్వ హాస్పిటల్ నందు 10వ తేదీన శారీరక అంగవైకల్యం గల 60 మందికి, 14వ తేదీన బుద్ధి మాంద్యం గల (ఎమ్మార్ ఎమ్ఐ) 50 మందికి, 24వ తేదీన శారీరక అంగవైకల్యం గల 60 మందికి, 28వ తేదీన బుద్ధి మాంద్యం గల 50 మందికి, 30వ తేదీన వినికిడి లోపం గల 60 మందికి క్యాంపులు నిర్వహించి పరీక్షలు చేయటం జరుగుతుందని తెలిపారు. వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ యందు ఈనెల 10వ తేదీన శారీరక అంగవైకల్యం గల 60 మందికి, 18వ తేదీన చూపులేని 50 మందికి, 24వ తేదీన బుద్ధి మాంద్యముగల 50 మందికి, 29వ తేదీన శారీరక అంగవైకల్యం గల 60 మందికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు సదరం సర్టిఫికెట్ పొంది సర్టిఫికెట్ కాలపరిమితి అయిపోయిన వారితోపాటు కొత్తగా స్లాట్ బుకింగ్ చేసుకున్న వారితో సహా 500 మందికి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# పసునూరులో ఘనంగా దేవి నవరాత్రులు

### ఆరో రోజు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు పూజలు చేసిన

### రాగి పని ధనుంజయ చారి దంపతులు



నీలగిరి వార్త /అక్టోబర్ 8 నల్గొండ జిల్లా ప్రతినిధి :శంకర్

దేవి నవరాత్రుల్లో భాగంగా పస్నూర్ గ్రామంలో అంగరంగ వైభవంగా అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారిని రాగి పని ధనుంజయ చారి దంపతులు పూజలు చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ, సభ్యులు పాల్గొన్నారు.



# నాద బ్రహ్మోత్సవంలో ఆకట్టుకున్న నీహాల్ భక్తి సంగీతం

శేరిలింగంపల్లి నీలగిరి వార్త

అన్నమాచార్య భావనా వాహిని సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత శోభారాజు ఆధ్వర్యంలో అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారి 10 రోజుల దసరా, బతుకమ్మ, నాద బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం ప్రముఖ నేపథ్య గాయకుడు నీహాల్ భక్తి గానామృతం చేశారు. ఈ కార్యక్రమంలో నీహాల్ "మొగదాకిరి అనే గజల్ సంగీతంతో ఆరంభించి, చాలదా హరినామ సౌఖ్యామృతము తమకు అంటూ, వేడుకుందామా వేంకటగిరి వేంకటేశ్వరుని" అంటూ చక్కని అన్నమయ్య సంకీర్తనలతో ఆద్యంతం అలరించారు. వీరికి కీబోర్డు మీద రాజు తబలా పై అజయ్ వాయిద్య సహకారం అందించారు. కాగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖులు, గౌరవనీయులైన తెలంగాణ ఒలింపిక్ ప్రెసిడెంట్, మాజీ యూనియన్ మినిస్టర్ డా. ఎస్. వేణు గోపాల చారి విచ్చేసి కళాకారుల సంగీతాన్ని ఆలకించి, "నీహాల్ సంగీతం చాలా బాగుంది., శోభారాజు



కృషి వలన ఎంతో మంది పిల్లలకు, పెద్దలకూ భక్తి, జ్ఞానం, వికాసం బలపడ్డాయని," తమ విలువైన సందేశాన్ని అందించారు. అనంతరం కళాకారులకు, ముఖ్య అతిథికి అన్నమాచార్య భావనా వాహిని పక్షాన సంస్థ వ్యవస్థాపకులు శోభారాజు , సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా. నంద కుమార్ జ్ఞాపికను అందించారు. చివరిగా, శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామి వారికి అంగనలీరే హారతులతో, పసందైన ప్రసాద నైవేద్యాలతో కార్యక్రమందిగ్విజయంగాజరిగాయి అని తెలిపారు.

# గెలుపు కన్నా క్రీడలలో పాల్గొనడం చాలా ముఖ్యం

### క్రీడలలో ప్రతి ఒక ఓటమే గెలుపునకు నాంది.

### ఓటములే, జీవిత పాఠాన్ని నేర్పుతాయి

### జిల్లా ఎస్పీ కే . నారాయణ రెడ్డి, ఐపీఎస్



నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి

జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పోలీస్ కానిస్టేబుల్స్ ల స్పోర్ట్ మీట్ ముగింపు కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో శిక్షణ పోలీస్ కానిస్టేబుల్స్ లకు వాలీబాల్, టాగ్ అఫ్ వార్, 100 మిటర్స్, 200 మిటర్స్, క్రికెట్ మొదలగు క్రీడలలో పోటీలు పెట్టడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డిటిసి ప్రిన్సిపాల్ మురళీధర్ , మీరందరికి మంచి శిక్షణను అంధించడం జరుగుతుంది. గెలుపు కన్నా స్పోర్ట్స్ లలో పాల్గొనడం చాలా ముఖ్యం, జీవితం కూడా ఒక క్రీడా లాంటిదే, క్రీడలలో ప్రతి ఓటమి, జీవిత పాఠాన్ని నేర్పుతుంది. జీవితం లో ఏవిధంగా విజయం సాదించాలి అనేది ఓటమి నుండే తెలుస్తుంది. క్రీడలు ఆడడం వలన



శారీరకంగానూ, మానసికంగానే కాకుండా భవిష్యత్తులో కూడా ఆరోగ్యంగా ఉంచడం లో, సంతోషకరమైన కమ్యూనిటీని నిర్మించడంలో, జీవితంలో క్రమశిక్షణ గా ఉండుటలో క్రీడలు ఎంతోగానో ఉపయోగపడుతాయి. జీవితం లో వచ్చే ఒడిదుడుకులను తట్టుకొని విజయం సాదించాలి అంటే ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యం. కావున ఆరోగ్యంగా ఉండుటకు ప్రతి ఒక్కరూ ప్రతి రోజు ఏదో ఒక క్రీడలో తప్పని సరిగా పాల్గొనాలని, పోలీస్ డిపార్ట్మెంట్లో పోలీస్ అధికారులు రిటైర్మెంట్ వరకు ఫీట్ గా ఉండటం కొరకు క్రీడలు,వ్యాయామం చాలా ఉపయోగపడుతాయి కావున ప్రతి ఒక్కరూ తమ రోజువారీ కార్యక్రమాలలో క్రీడలకు, వ్యాయామానికి ప్రముక్యత కల్గించలని ఎస్పీ తెలిపినారు. ఇట్టి కార్యక్రమంలో గెలుపొందిన వారికి జిల్లా ఎస్పీ అభినందించి వారికి మెమంటోలు అందించడం జరిగింది. డిటిసి నందు శిక్షణ ఇస్తున్న ప్రతి ఒక్కరికీ జిల్లా ఎస్పీ అభినందించి మేమంటో లు అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డిటిసి ప్రిన్సిపాల్ మురళీధర్ ,జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి , డిటిసి డిఎస్పి విజయ్ కుమార్ , ఏఆర్ డిఎస్పి వీరేశ్ , సిఎల్ఐ , ఇన్స్పెక్టర్ లు ,ఆర్ఐలు , ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# మన బతుకమ్మ ప్రకృతికే అందం



### - వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి

వికారాబాద్ జిల్లా కార్యాలయ ఆవరణలో మంగళవారం జిల్లా అధికార యంత్రాంగం బతుకమ్మ పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ హాజరై గౌరీ మాత పూజను నిర్వహించి బతుకమ్మ పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డి ఆర్ డి ఏ, డి డబ్ల్యూ ఓ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు స్వయంగా బతుకమ్మలను పేర్చి ఆయా శాఖల నుండి ఉద్యోగులందరితో కలిసి బతుకమ్మలను ఆటపాటలతో చప్పట్లు కొడుతూ లయబద్ధంగా ఆడటం జరిగింది. జిల్లా కలెక్టర్ బతుకమ్మల వద్దకు వెళ్లి మహిళలతో బతుకమ్మ ఆట ఆడటం ద్వారా బతుకమ్మ ఉత్సవానికి మరింత ఊపు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ మాట్లాడుతూ మన బతుకమ్మ పకృతికె ఒక అందమన వర్ణించారు. ఇలాంటి బతుకమ్మ పండుగను కలెక్టర్ కార్యాల



యంలో ఇంత ఆనందంగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు (రెవెన్యూ) లింగ్యా నాయక్, సుధీర్, డిఆర్డిఓ శ్రీనివాసులు, కృష్ణవేణి, డిపిఆర్ఓ చిన్నమ్మ, సరోజ, డ్వాక్రా గ్రూప్ మహిళలు, ఇతర శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పాలకీడు మండల కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నీలగిరి వార్త పాలకీడు

పాలకీడు మండల కేంద్రాన్ని మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు...ఈ సందర్భంగా మండలం కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసి రికార్డులఖ్ని పరిశీలన చేశారు..మండల కేంద్రంలోని ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ నీ నియమించేందుకు చర్యలు తీసు



కుంటాని హామీ ఇచ్చారు..ఈ సందర్భంగా మండలం మాజీ ఎంపిపి గోపాల్ నాయక్ జగ్గయ్యపేట నుండి విష్ణు పురం కింద వెళ్లే రైల్వే లైన్ క్రింద నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని,గ్రామాలలో అర్హులైన పెదలకి స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్లు మంజూరు చేయించాలని వినతి పత్రం అందించారు..ఆయన వెంట హుజుర్నగర్ ఆర్డివో శ్రీనివాసులు, మండల ఏమార్వో కమలాకర్, ఎంపిడివో లక్ష్మి, ఎంఈవో కాటయ్య పాల్గొన్నారు.



# దేవుని గుడి తండాలో సభ్యత్వం డ్రైవ్ నిర్వహించిన కార్యకర్తలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న సభ్యత్వ నమోదు కో కన్వీనర్ కుమ్మరి మహేష్



షాద్నగర్ నీలగిరి వార్త

కేశంపేట్ మండలం దేవుని గుడి తండా గ్రామంలో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజలు భారతీయ జనతా పార్టీ లో మెంబర్షిప్ తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నారు నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తేవాలని వారిలో స్వచ్ఛందంగా కృషి కనిపిస్తుంది. ఈ కార్యక్రమంలో కేశంపేట మండలం ఉపాధ్యక్షులు పల్లె అశోక్ సీనియర్ నాయకులు భక్తవత్సల రెడ్యానాయక్ పిరు నాయక్ రమేష్ నాయక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సదరం క్యాంపు అర్హత కలిగిన వారు వినియోగించుకోవాలి

### నవాబుపేట్ ఎంపీడీవో అనురాధ



నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి:

వికారాబాద్ జిల్లాలో ఈనెల వికలాంగులకు సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపినట్లు నవాబుపేట్ మండల ఎంపీడీవో మంగళవారం తెలిపారు. జిల్లా పరిధిలోని తాండూర్ ప్రభుత్వ హాస్పిటల్ యందు 10, 14, 24, 28, 30వ తేదీలలో స్లాట్ బుక్ చేసుకున్న అంగవైకల్యం కలిగిన వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఈనెల 10, 18, 24, 29 తేదీలలో అంగవైకల్యం, అందులు, బుద్ధి మాంద్యం గలవారు హాజరు కావాలన్నారు. సదరం సర్టిఫికెట్ ఇదివరకు పొంది కాలపరిమితి అయిపోయిన వారితో కొత్తగా స్లాట్ బుక్ చేసుకున్న వారు కూడా హాజరు కావాలన్నారు.

# కొత్త తండా గ్రామంలో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులతో సిసి రోడ్ నిర్మాణ ప్రారంభోత్సవం

### ప్రారంభోత్సవానికి విచ్చేసిన మండల పార్టీ అధ్యక్షులు

### ఎన్ వి సుబ్బారావు

### మాజీ ఎంపీపీ భూక్య గోపాల్ నాయక్





నీలగిరి వార్త పాలకీడు

సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం జాన్ పహాడ్ గ్రామపంచాయతీ కొత్త తండా గ్రామంలో మాజీ జడ్పిటిసి బుజ్జి మోతిలాల్ నాయక్ ఎన్ ఆర్ ఈ జి ఎస్ నిధుల నుండి 5 లక్షల రూపాయలు తో కొత్త తండా గ్రామంలో సిసి రోడ్ నిర్మాణ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జ్యోతి ఉమా మైనారిటీ నాయకుడు బాల సైదా అల్లావుద్దీన్ యూత్ కాంగ్రెస్ శ్రీకాంత్ శేషు మరియు చంటి మల్లేష్ సీనియర్ నాయకుడు కోటయ్య కృష్ణ జాను శంకర్ రామారావు తదితర నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గేటును అందించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నీల రవికుమార్



దేవరకొండ నీలగిరి వార్త

డిండి మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన గేటును మంగళవారం దేవరకొండ పట్టణానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నీల రవికుమార్ నూతన గేటును తయారు చేయించి కళాశాల ఆవరణకి ఏర్పాటు చేశారు. డిండిమండల కేంద్రంలో గల దొంతినేని నరసింహారావు ప్రభుత్వ జూనియర్ కళాశాల గేటును కళాశాల అధ్యాపకులు పార్టీ అభిమానుల కోరిక మేరకు గత సంవత్సరంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కళాశాల రక్షణ కొరకు విద్యార్థుల బాగోగులో కోసం గేటును బహూకరించాలని తెలిపారు. పాఠశాలలకు సెలవులు కావడంతో తిరిగి పాఠశాలలు తెరిచేలోపు నూతన గేటు ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గేటును ఏర్పాటు చేసిన నీల రవికుమార్ ను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

## కరెంటు షాక్‌తో యువకుడు మృతి

**-నాప్రాణ స్నేహితుడా కృష్ణ కలిసి పుట్టకున్నా కడవరకు కలిసే జీవితం అనుకున్నం.**

**-కానరాణి లోకాలకు వెళతావని కలలో కూడా అనుకోలేదు.**

**-ఇంటికి వచ్చినప్పుడల్లా ఇంకెప్పుడు సక్సెస్ అవుతామురా అని మనలో మనమే మదనపడే వాళ్ళం.**

**-మంచి ఇల్లు కట్టాలి అన్నావ్ ఎవరు చూడని రాని చోట ఇల్లు కట్టుకుని నన్ను ఒంటరిని చేసావ్.**

**-అందరిని కలుపుకుపోయే నా కృష్ణ ఇక లేడని ఊరంతా బోరుంటుంది.**





మద్దిరాల నీలగిరి వార్త అక్టోబర్ 9

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండలం లో కరెంటు షాక్ తో యువకుడు మృతి చెందాడు మండల కేంద్రం మద్దిరాలలో మంగళవారం భూతం కృష్ణ తండ్రి వెంకన్న(25) సంవత్సరాలు కులం యాదవ్ కరెంటు షాక్ తో మృతి చెందడం జరిగినది గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తన యొక్క వరి పొలంలో మిషన్ తో వరి కోయించడం కోసం ఉదయం 7:00 గంటల కు ఇంటి నుండి వెళ్లి హార్వెస్టర్ రావడానికి వరాల చుట్టూ తిరుగుతూ కరెంటు వైర్లను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు ఎడమ చేతికి కరెంటు తీగ తగిలి కృష్ణ అక్కడికక్కడే చనిపోవడం జరిగినది అతని తండ్రి భూతం వెంకన్న తండ్రి గోపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియా హాస్పిటల్ లో పోస్టుమార్టం నిర్వహించి న అనంతరం డెడ్ బాడీని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వీరన్న తెలిపారు కృష్ణ మరణ వార్త విని మద్దిరాలలో ఒక్కసారిగా విషాదఛాయలు అమలుకున్నాయి.

## శ్రీ భక్త మార్కండేశ్వర స్వామి దేవాలయంలో కొనసాగుతున్న శరన్నవరాత్రులు





దేవరకొండ నీలగిరి వార్త

దేవరకొండ పట్టణంలోని శ్రీ శ్రీశ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రతిష్టించినటువంటి శ్రీ శ్రీ శ్రీ దుర్గామాత అమ్మవారు శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిందని ఆలయ కమిటీ అధ్యక్షులు గౌరవ అధ్యక్షులు సరిపోతు శ్రీరాములు అధ్యక్షులు వనం జగదీశ్వర్, చేరిపెల్లి యల్లయ్య, మసన మణిదీప్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు అమ్మవారి సహస్ర అభిషేక పూజలు ప్రత్యేకంగా అమ్మవారికి కనకాభిషేకం ఘనంగా పూజ దంపతులచే దంపతులు భక్తులు కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి వారికి ఆలయ పురోహితులచే అర్చనలు అభిషేకలు నిర్వహించి భక్తులచే కనకాభిషేకం పూజా దంపతులు భక్తులు కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వనం జగదీశ్వర్ మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు నైవేద్యాలను సమర్పించినట్లు ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. రోజురోజుకు భక్తులు భారీగా హాజరవుతున్నారని పట్టణంలోనే దుర్గామాత దేవాలయం శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించబడిందని తెలిపారు .ప్రతి శుక్రవారం అమ్మవారికి వందలాదిగా మహిళలు పూజలు నిర్వహించి కోలిన కోరికలు నెరవేరే అమ్మవారి దేవాలయంగా ప్రతిష్టకు ఎక్కిందని తెలిపారు.సాయంత్రం శ్రీ దుర్గా మాత అమ్మవారిని భక్తులచే భజనలు కోలాటాలతో పల్లకి సేవ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- యశోద మలక్పేట ఆసుపత్రి వైద్యులచే మెగా ఉచిత వైద్య శిబిరం
- 300 మందికి ఉచితంగా పరీక్షలు మందులు అందజేత
- బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షలు
- సద్వినియోగం చేసుకున్న గ్రామ ప్రజలు
- మరిన్ని ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తాం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కులసత్యనారాయణ
- అభినందనలు తెలిపిన మాజీ సర్పంచ్ జూలూరు ధనలక్ష్మి బాల నారాయణ గౌడ్



దేవరకొండ నీలగిరి వార్త

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు దీర్ఘకాలిక వ్యాధులతో పాటు మోకాళ్ల నొప్పులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ మెరుగైన వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్న వారికోసం లయన్స్ క్లబ్ యశోద మలక్పేట ఆసుపత్రి వైద్యులచే మంగళవారం దేవరకొండ మండలంలోని తాటి కోలు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని గ్రామ మాజీ సర్పంచ్ జూలూరు ధనలక్ష్మి బాలనారాయణగౌడ్, తిప్పర్తి రుక్మారెడ్డి, సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు వస్కుల సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 300 మంది పైగా మోకాళ్లు, కంటి,గుండె, షుగర్ ,బిపి పరీక్షలు నిర్వహించారు. పల్లెల్లో మొదలుకొని పట్టణాల వరకు అన్ని రకాల జబ్బులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు వైద్యాన్ని చేరువ చేస్తున్నామని నేటి పరిస్థితుల్లో కార్పొరేట్ లాంటి వైద్యం అందుకోలేని పేదలకు అత్యధిక అత్యాధునికమైనటువంటి పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బోన్ మినరల్ డెన్సిటీ టెస్టులు సైతం అందుబాటులోకి తీసుకొచ్చి గ్రామంలో కీళ్ల నొప్పులతో బాధ పడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించామని గ్రామ మాజీ సర్పంచ్ జూలూరు ధనలక్ష్మి బాల నారాయణ గౌడ్ మాట్లాడుతూ కీళ్లనొప్పులు తో బాధపడుతున్న వారికి యశోద ఆసుపత్రి వైద్యులు లయన్స్ క్లబ్ ద్వారా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ, జోన్ చైర్మన్ వనం బిక్షమయ్య, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి నిరంజన్, తిప్పర్తి రుక్మారెడ్డి , గాజుల రాజేష్, శిరందాసుకృష్ణయ్య, గుద్దేటి జంగయ్య, వనం



శ్రీనివాస్ ,నల్ల మాద నారాయణరెడ్డి, సముద్రాల శ్రీనివాస్, గోవిందు కొండయ్య, లకుమరపు మల్లయ్య, నారాయణ సింగ్, మాజీ ఎంపీటీసీ జూలూరు అంజయ్య, జూలూరు గిరిప్రసాద్ ,జూలూరు అంజయ్య, కనకాచారి ఎరుకల అశోక్ గౌడ్ ,దొంతినేని వెంకటరమణా, పల్సర్ కృష్ణయ్య, ఉపసర్పంచ్ రవి, పల్చ కొండయ్య ,తదితరులు పాల్గన్నారు.

## కొండమల్లేపల్లి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కొనసాగుతున్న శరన్నవరాత్రులు

**6వ రోజు శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణతో భక్తులకు దర్శనం**

**పూజలో పాల్గొన్న దంపతులు పెద్ద ఎత్తున హాజరైన భక్తులు**

**మధ్యాహ్నం అన్నప్రసాదం వితరణ**

**పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శరన్నవరాత్రులు**





దేవరకొండ నీలగిరి వార్త

కొండమల్లేపల్లి పట్టణంలోని సాగర్ రోడ్‌లో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆరవ రోజు శరన్నవ రాత్రులలో భాగంగా మంగళవారం శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలతో భక్తులకు దర్శనం ఇచ్చిందని పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు సముద్రాల దనయ్య, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి నరేందర్, కోశాధికారి కర్నాటి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరన్న వరాత్రుల్లో భాగంగా ఆరవరోజు దంపతులు పెద్ద ఎత్తున హాజరై పూజలో పాల్గొన్నారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదలతో పాటు మధ్యాహ్నము అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సముద్రాల ధనయ్య ,ప్రధాన కార్యదర్శి దాచేపల్లి నరేందర్, కోశాధికారి కర్నాటి శ్రీనివాసులు, లతోపాటు నీల లక్ష్మయ్య కొండమల్లేపల్లి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సముద్రాల వెంకన్న , పూజా కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు దాచేపల్లి నరేందర్ సంధ్యారాణి, తేరేటిపల్లి విట్టల్ విజయలక్ష్మి, వీరమల్ల వెంకటయ్య పద్మ, సోమ జగన్మోహన్ లక్ష్మి, మంచి కంటి జగన్మోహన్ ,నీల రవికుమార్ ఉదయశ్రీ, ముచ్చర్ల కర్ణాకర్ మాధవి,లతో నీల లక్ష్మయ్య, పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో కొనసాగుతున్న శరన్నవరాత్రులు

**ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలతో భక్తులకు దర్శనం**

**సాయంకాలం అమ్మవారి పల్లకి సేవ**

**మహిళలచే కోలాటాలు నృత్యాలు పాటలచే**

**ఆద్యంతం భక్తి పరవశంతో సాగిన పల్లకి సేవ**

**ఉదయం అల్పాహారం మధ్యాహ్నం అన్న ప్రసాదం**



దేవరకొండ నీలగిరి వార్త



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా మంగళవారం శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిందని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చీదేళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరవ రోజు అత్యంత వైభవంగా దేవాలయంలో భక్తులచే పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు దేవాలయ ప్రధాన అర్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్యం శిశు బృందంచే దంపతులచే అమ్మవారికి పూజ నిర్వహించారని వారి పేర్కొన్నారు. సాయంకాల వేళ దుర్గామాత పల్లకి సేవ అత్యంత వైభవంగా మహిళలచే కోలాటాలు నృత్యాలు పాటలచే పురవీధుల గుండా పల్లకి సేవ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, అధ్యక్షులు చేదెళ్ల వెంకటేశ్వర్లు కార్యదర్శి సముద్రాల ప్రభాకర్ కోశాధికారి కొత్త సుబ్బారావు వాసవి కళ్యాణ మండప అధ్యక్షులు వాసా వెంకటేశ్వర్లు, దంపతులు అలంపల్లి నరసింహ పార్వతమ్మ కుంచకూరి సురేష్ సంధ్యారాణి దొడ్డి రామ్మూర్తి శారద, పొడునూరి దయానంద్ పద్మశ్రీ, ఉప్పల రాంబాబు నీరజ సముద్రాల జగన్మోహన్ జయలక్ష్మి, విడియాల రవికుమార్ శ్రీలక్ష్మి, కర్నాటి పురుషోత్తం, బిక్కుమల్ల లక్ష్మీనారాయణ, సముద్రాల చంద్రశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి పరిష్కారానికి త్వరలోనే కృషి చేస్తాం: ప్రశాంత్ గౌడ్

నీలగిరి వార్త ఎల్లారెడ్డి:

ఎల్లారెడ్డి పట్టణంలోని ఏడో వార్డులో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ గారి దృష్టికి సమస్య తీవ్రత ను తీసుకువెళ్లి అతి త్వరలోనే నీటి సమస్య పరిష్కారం చూపిస్తానని పిఏసిఎస్ వైస్ చైర్మన్ మతమల ప్రశాంత్ గౌడ్ కాలనీవాసులకు తెలిపారు. తాగు నీటి సమస్య పరిష్కారం కోసం మున్సిపల్ సిబ్బందిని పిలిపించి మాట్లాడారు. తాగు నీటి సమస్యకు పరిష్కారం త్వరలో చేస్తామని కాలనీవాసులతో ప్రశాంత్ కూడా పేర్కొన్నారు.



## మిర్యాల వజ్రమ్మ పార్థివదేహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు



నీలగిరి వార్త /అక్టోబర్ 8 నల్గొండ జిల్లా ప్రతినిధి :శంకర్

మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన మాజీ మండల రైతు బంధు సమితి అధ్యక్షులు మిరియాల మధుసూదన్ తల్లి అయిన మిరియాల వజ్రమ్మ (95 సంవత్సరాలు) వృద్ధాప్యములో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు వారి పార్థివదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. వారి వెంట మాజీ జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ ఎండి. మోషీన్ అలీ, మండలాధ్యక్షులు పాలుట్ల బాబయ్య నాయకులు జేరిపోతుల రాములు గౌడ్, ఇంద్రా రెడ్డి, కోటి రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకట చారి, మారుతి వెంకట రెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు..

## శ్రీ భవానీదేవీ శరన్నవరాత్ర ఉత్సవములు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:

కామారెడ్డి పట్టణము పశ్చిమ హౌసింగ్ బోర్డ్ కాలనీ (శివ పురము) లో గల శ్రీ సంకష్టహర మహాగణపతి క్షేత్రములో కొలువుదీరిన అమ్మలగన్న మాయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ శ్రీ మహాకాళీ మహాలక్ష్మీ మహా సరస్వతి స్వరూపిణీ శ్రీ భవానీ (భువనేశ్వరి) అమ్మవారి శరన్నవ రాత్ర ఉత్సవములని పురస్కరించుకొని భవానీ అమ్మవారిని మం గళవారం ఆరవ రోజు కాత్యాయిని అమ్మవారిగా మరియు శ్రీ గజలక్ష్మీ అమ్మవారి స్వరూపముగా అలంకరించి ప్రాతఃకాలము నుండి విశేష అభిషేక కుంకుమార్చన పూజా కార్యక్రమములు జరి గినవి. ఈ కార్యక్రమములో అర్చకులు, కమిటి సభ్యులు మరియు భక్తమహాశయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించి జగన్మాత కృపకు పాత్రులైనారు. దివ్యముగా అలం కృతురాలై భక్తకోటిని అనుగ్రహిస్తున్న జగన్మాతను దర్శించి అనుగ్రహాశీస్సులు పొందినారు.





ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా మెజిస్ట్రేట్ అండ్ కలెక్టర్ గౌరవ ఆశిశు సాంగ్ వన్ గారిని అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రజిత మేడం గారిని అదేవిధంగా మైనార్టీ వెల్ఫేర్ ఈడి దయనం ధుసార్ గారిని మరియు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు సార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సమస్యల మీద ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆలిండి అంబేద్కర్ యువజన సంఘం కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు బొంద రాజ్ కుమార్ జిల్లా గౌరవాధ్యక్షులు బ బటెంకిబాలరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి జి ప్రభాకర్ జిల్లా ఉపాధ్యక్షులు తమ్మిడి స్వామి ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షులు ప్రదీప్ కుమార్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు ఎడ్ల కిషన్ ఎల్లారెడ్డి డివిజన్ సెక్రెటరీ మహేందర్ మాచారెడ్డి మండల అధ్యక్షులు లక్ష్మీరాజందోమకొండ మండల అధ్యక్షులు కరిక మురళి పాల్వంచ మండల అధ్యక్షులు బట్టరాజు దోమకొండ మండల ఉపాధ్యక్షులు నత్తి జీవన్ పాల్వంచ మండల ఉపాధ్యక్షులు బట్టునరేష్ పాల్వంచ అదేవిధంగా చందర్ నాయక్ జిల్లా అడ్వైజర్ బైండ్ల భూపతి జిల్లా అడ్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పరంజ్యోతి భగవతి భగవాన్ ఆలయంలో అన్నదానం





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కల్కి నగర్ లో గల శ్రీ పరంజ్యోతి భగవతి భగవానుల ఆలయంలో మంగళవారం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. నేటి కార్యక్రమానికి అన్నదాతలుగా గడ్డమీది సురేఖ శ్రీనివాస్ గాంధారి, ఎర్ర స్రవంతి సుజిత్ రెడ్డి వడ్లూర్ ఎల్లారెడ్డి, అంకరాజు స్వప్న కిషోర్ కుమార్ కామారెడ్డి దంపతులు ముందుకు రావడం జరిగిందని వారికి కల్కి మానవ సేవా సమితి తరపున సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిం దన్నారు. అన్నదాన కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని ప్రతి మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈ అన్నదాన కార్యక్రమానికి 350 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించడం జరిగిందన్నారు.అన్నదానం చేయాలనుకున్న వారు మరిన్ని వివరాల కోసం ఎర్రం చంద్రశేఖర్ ను 98496 01438 ను సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎర్రం చంద్రశేఖర్, శ్రీనివాస్,ఎర్రం విజయ్ కుమార్,వినోద్ ఆలయ సేవకులు పాల్గొనడం జరిగింది.

## యువకుడి బలవన్మరణం..

**నీలగిరి వార్త ఆదిలాబాద్ ప్రతినిధి :**



మంచిర్యాల జిల్లా మందమర్రిలో అమ్మను అనాధ చేసి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని యాపల్ ప్రాంతానికి చెందిన మృతుడు మామిడాల తిరుపతి కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో ఎముకలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. పని చేసేందుకు తిరుపతి శరీరం సహకరించకపోవడం, తిరుపతి తండ్రి ఇటీవల మృతి చెందడంతో నిస్సహాయతకు గురయ్యాడు. ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన తిరుపతి సోమవారం రాత్రి బలవన్మరణానికి పాలుపడటం జరిగింది. మంగళవారం ఉదయం మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉపాది అవకాశాలు చూపకుండా యువత ఉసురు తీస్తున్నవి ప్రభుత్వాలు అంటూ బస్తి ప్రజలు మృతుడు తిరుపతి స్నేహితులు మాట్లాడుతూ విలపించారు.

## గల్ఫ్ బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ భరోసా

### జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగరాజ్ గౌడ్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గల్ఫ్ కార్మికులకు హామీ ఇచ్చిన విధంగా గల్ఫ్ లో మరణించిన బాధిత కుటుంబాలకు రూ 5 లక్షల ఆర్థిక సాయం అందజేసే 216 జీవోను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసినందుకు జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటిసారిగా గల్ఫ్ ప్రాంతాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల సంక్షేమం కోసం ఈ విధమైన ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ప్రజా భవన్ లో "ప్రవాసి ప్రజావాణి" పేరిట పిర్యాదులను స్వీకరించే కార్యక్రమం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిదన్నారు. తెలంగాణ గురుకులాల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు సీట్లలో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం గల్ఫ్ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. గల్ఫ్ కార్మిక సమస్యలపై, వారి సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు.గల్ఫ్ దేశాల్లో పనిచేస్తూ 2023 డిసెంబర్ 7 తర్వాత ఏ కారణం చేతనైనా మరణించిన కార్మికుడి కుటుంబాలకు ఈ పరిహారం వర్తిస్తుందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేయడం హర్షణీయమన్నారు.గల్ఫ్ కార్మికుల కుటుంబాల కష్టాలు తెలిసిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రి వర్గానికి,ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

## ఏడు రోజులలో సద్దుల బతుకమ్మ

### ఏడు రోజులలో ఘనంగా సద్దుల బతుకమ్మ



**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని.. తెలంగాణ ఆడపడుచులు ఎంతో ఇష్టంతో జరుపుకునే పూల పండుగ ప్రకృతిని ఆరాధించే కమనీయమైన పండుగ సంస్కృతి సాంప్రదాయాలకు పట్టం కట్టే తెలంగాణకే సొంతమైన పండుగ అలాంటి బతుకమ్మ సంబరాలను తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు చివరి రోజున సద్దుల బతుకమ్మ గా పేర్కొంటారు ఆరోజు అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించి బతుకమ్మలను నిమజ్జనం చేసి గౌరమ్మను సాగనంపుతారు వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నేడు నిర్వహించరు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు భిన్నంగా వేములవాడ పట్టణంతో పాటు రూరల్ లో వట్టేముల శాత్రజ్ పల్లి కొడిముంజ జయారం ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం నేడు సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునే వారు తర్వాత తల్లి గారి ఇంటికి వెళ్లి అక్కడ సైతం సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించరు కాబట్టి రెండు రోజుల ముందే సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించి ఆ తల్లిని పూజిస్తారు. మాత్రమే కనిపిస్తుంది. చుట్టుపక్కల గ్రామాలను యధావిధిగా 9 రోజులకు బతుకమ్మ ఆడతారు ఈ కార్యక్రమంలో వట్టెంలా పోస్ట్ ఆఫీస్ వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఇక్కడ కూల సంఘ నాయకులు బ్రాంచ్ పోస్టు ఆఫీసీర్ రాజు శ్రీనివాస్ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో జలశక్తి అభియాన్ క్రింద చేపడుతున్న కార్యక్రమాల పరిశీలన

### కేంద్ర పవర్ మినిస్ట్రీ డిప్యూటీ సెక్రటరీ బెంజమెన్ కరుణాకరన్





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**
జిల్లాలో జలశక్తి అభియాన్ క్రింద చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించడానికి కేంద్ర పవర్ మినిస్ట్రీ డిప్యూటీ సెక్రటరీ బెంజమెన్ కరుణాకరన్ జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. జిల్లాలో జలశక్తి కార్యక్రమం క్రింద వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై మంగళవారం రోజున కలెక్టరేట్ సమావేశ మందిరంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు వివరించారు. గ్రామీణాభివృద్ధి, గ్రౌండ్ వాటర్, అటవీ, నీటి పారుదల, వ్యవసాయం, ఉద్యానవనం శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ఆయా శాఖాధికారులు వివరించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఆచార్య శ్రీకృష్ణ పవార్, అదనపు కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అటవీ అధికారిని నిఖిత, జడ్పీ సిఈఒ చందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యాన అధికారిని జ్యోతి, గ్రౌండ్ వాటర్ అధికారి సతీష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**
వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, సన్న రకం, దొడ్డు రకం ధాన్యాన్ని విడివిడిగా సంచుల్లో నింపాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాక్స్ సి.ఈ. ఒ. లు, ఐ.కే. పి. సెంటర్ ఇన్చార్జి లు, వ్యవసాయ శాఖ వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు లకు ధాన్యం కొనుగోళ్ల పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే ధాన్యం ను పరిశీలించి సన్న రకం, దొడ్డు రకం లను విడివిడిగా నింపాలని తెలిపారు. ప్రతీ సంచిపై సెంటర్ కోడ్, జిల్లా కోడ్ వేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు, టెంట్, గన్నీ బ్యాగ్స్ తదితర ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని అన్నారు. వర్షాల వలన ధాన్యం తడిసి పోకుండా ఉండేందుకు ప్రతీ కేంద్రంలో టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని తెలిపారు. కొనుగోలు చేశాక ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని అన్నారు. ప్రతీ సంచీపై యూనిక్ నెంబర్ వేయడం జరుగుతుందన్నారు. ఏదైనా వేరైటీ సమస్య ఏర్పడినపుడు సంబంధిత వ్యవసాయ అధికారులను అడగాలని తెలిపారు. ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సెంటర్ లలో నిల్వ చేయరాదని అన్నారు. రైతుల నుండి అవసరమైన ధృవీకరణ పత్రాల జీరాక్స్ కాపీలను తీసుకోవాలని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ళ లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా, విజయవంతంగా కొనుగోళ్ళ చేయాలని తెలిపారు. అంతకు ముందు ధాన్యం తేమ శాతం, ధాన్యం పరిశీలన వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, సహాయ పౌర సరఫరాల అధికారి నరసింహ రావు, జిల్లా సహకార అధికారి , తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**



తెలంగాణ మహిళలకు బతుకమ్మ గొప్ప పండుగ అని, మహిళల ఐక్యతకు నిదర్శనమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం రోజున ఐ.డి.ఒ.సి. లో జనహిత వారి సౌజన్యంతో తెలంగాణ జె.ఎ.సి. ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రసంగిస్తూ, మహిళా ఉద్యోగుల కోసం బతుకమ్మ వేడుకలను నిర్వహించడం అభినంద నీయమన్నారు. బతుకమ్మ వేడుకలు, దసరా పండుగ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్ లో బతుకమ్మ సంబరాలు నిర్వహించడం టీజీవో, టీఎన్జీవో లకు అభినందనీయమన్నారు. పలు శాఖల మహిళా ఉద్యోగినులు పాల్గొనడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ లో సంప్రదాయంగా బతుకమ్మ పండు గలను మహిళలు నిర్వహించు కుంటారని తెలిపారు. మొదటి మూడు ఉత్తమ బతుకమ్మ లకు బహుమతులను కలెక్టర్ ప్రదానం చేసారు. మొదటి బహుమతి ఐసీడీఎస్ శాఖకు అందించారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అధ్యక్షులు ఎన్.వెంకట్ రెడ్డి, టీజీవో అధ్యక్షులు డా. ఆర్. దేవేందర్, సెక్రటరీ సాయి రెడ్డి, టీఎన్జీవో నాయకులు సంతోష్, శివకుమార్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఏడు రోజులలో ఘనంగా సద్దుల బతుకమ్మ

### ఏడు రోజులలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని.. తెలంగాణ ఆడపడుచులు ఎంతో ఇష్టంతో జరుపుకునే పూల పండుగ ప్రకృతిని ఆరాధించే కమనీయమైన పండుగ సంస్కృతి సాంప్రదాయాలకు పట్టం కట్టే తెలంగాణకే సొంతమైన పండుగ అలాంటి బతుకమ్మ సంబరాలను తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు చివరి రోజున సద్దుల బతుకమ్మ గా పేర్కొంటారు ఆరోజు అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించి బతుకమ్మలను నిమజ్జనం చేసి గౌరమ్మను సాగనంపుతారు మూలవాగు వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నేడు నిర్వహించరు రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలకు భిన్నంగా వేములవాడలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ వేములవాడలో నేడు సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునే వారు తర్వాత తల్లి గారి ఇంటికి వెళ్లి అక్కడ సైతం సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించరు అమ్మవారు కొలువైన పుణ్యక్షేత్రం కాబట్టి రెండు రోజుల ముందే సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించి ఆ తల్లిని పూజిస్తారు. కేవలం ఇది వేములవాడ పట్టణంలో మాత్రమే కనిపిస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ ఎఎస్పీ సిఐలు ఎస్ఐలు మున్సిపల్ కౌన్సిల్ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ మున్సిపల్ కౌన్సిలర్లు బిఆర్ఎస్ నాయకులు తోట అగయ్య అరుణ చెల్మెడ లక్ష్మీనరసింహారావు విమలక్క అధికారులు ప్రజా ప్రతినిధులు తది తరులు పాల్గొన్నారు.

## ఈశ్వరగారి రాజమణి దేవి చారిటబుల్ ట్రస్టు ద్వారా తడి చెత్త పొడి చెత్తను డస్ట్ బిన్ లను అందజేత



**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**
వేములవాడ లోని శ్రీమతి ఈశ్వరగారి రాజమణి దేవి చారిటబుల్ ట్రస్టు ద్వారా మంగళవారం తడి చెత్త పొడి చెత్తను దేవాలయంలో వేరు చేసే డస్ట్ బిన్ లను ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వినోద్ రెడ్డి కు అందజేశారు కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఈశ్వర గారి రమణ శుభచరణ్ ప్రొఫెసర్ పివి ప్రదీప్ కుమార్ కాంగ్రెస్ నాయకులు మరియు దేవాలయ అధికారులు పాల్గొన్నారు దేవాలయ పరిసరాలు యాత్రికుల నివాస స్థలాలలో వీటిని ఏర్పాటు చేయాలని దేవాలయం అవసరాలకు అవసరమైనన్ని శ్రీమతి రాజమణి దేవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేస్తామని రమణ తెలిపారు ఇదివరకే దేవాలయం సందర్శనకు వచ్చే యాత్రికుల సౌకర్యార్థం అంబులెన్సును కూడా అందజేసినట్లు రమణ తెలిపారు.

## కామారెడ్డి జిల్లా జాతీయ రహదారుల గుండా ఉన్న దాబా హొటల్ పై పోలీసుల దాడులు





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:**

దాబా హొటల్ మద్యం అమ్మకాలు సిట్టింగులు నిర్వహిస్తున్న యజమానులపై కేసుల నమోదు.
జాతీయ రహదారి పక్కన ఉండే దాబా హొటల్స్ నందు మంగళవారం మద్యం అమ్మకాలు జరిపి, త్రాగుటకు అనుమతిస్తున్నందువలన చాలామంది అక్కడ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోతున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఉద్దేశంతో డాబాలపై ప్రత్యేకంగా దాడులు నిర్వహించడం జరిగింది, ఈ దాడులలో 9 ధాబాల యందు మద్యం సేవించుచు పట్టుబడినారు. ఈ దాబాల యజమానులపై కేసులు నమోదు చేసి. కఠినమైన చర్యలు తీసుకోబడును.
క్రింది దాబాలపై కేసు నమోదు అయినవి

1. న్యూ శరన్ దాబా పొందుర్తి ఎక్స్ రోడ్
2. ప్రవీణ్ దాబా దోమకొండ
3. మణికంత దాబా పెద్ద మల్లారెడ్డి బిక్నూర్ మండల్
4. నారా గౌడ్ దాబా లింగంపేట్
5. ఆదిత్య దాబా లింగంపేట్
6. ఎస్ ఆర్ దాబా గాంధారి
7. 36 దాబా పెద్దకొడంగల్
8. 36 దాబా బిచ్కుంద
9. ప్యారడైజ్ దాబా బిచ్కుంద

ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయి. ఇకపై ఎవరైనా దాబాల యందు మద్యం సిట్టింగులు నిర్వహిస్తే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయబడతాయి, కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోబడతాయని పోలీస్ అధికారులు తెలిపారు.

## వేములవాడ రాజన్నను దర్శించుకున్న కేంద్ర హొంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్



**నీలగిరి వార్త వేములవాడ ప్రతినిధి**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని కేంద్ర హొం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ మంగళవారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న కేంద్ర హొమ్ శాఖ సహాయక మంత్రికి ఈవో కె.వినోద్ రెడ్డిగారు పూల మొక్కతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు ఆశీర్వదించగా ఈవో లడ్డూ ప్రసాదం అందజేశారు వారి వెంట ఏఈఓ లు శ్రీనివాస్ రమేష్ పర్యవేక్షకులు తిరుపతిరావు అశోక్ ఆలయ సిబ్బంది ఎడ్ల శివ సాయి పురాణం వంశీ ఉన్నారు.